ప్రభాత
# నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | TGTEL/25/A0100 | వాస్తవాలే వార్తలుగా..
18.6.2025 బుధవారం Wednesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 20 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana




## 'యోగా డే'లో పెద్ద ఎత్తున పాల్గొనండి



యోగాతో ప్రపంచ ఐక్యతా స్ఫూర్తి
యోగా సందేశంలో ప్రధాని మోడీ

.. వివరాలు 2లో



## గోదావరి-బనకచర్ల వివాదం





- నేడు అన్ని పార్టీల ఎంపీలతో రేపు సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వ సమావేశం
- గౌరవ అతిథులుగా కేంద్ర మంత్రులు కిషన్, బండికి ఆహ్వానం
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీలకు లేఖలు, ఫోన్లు
- ఏపీ తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీస్తుందని ఉత్తమ్ ఆందోళన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టుపై అన్ని పార్టీల లోక్సభ. రాజ్యసభసభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. సచివాలయంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో రేపు సాయంత్రం 4 గంటలకు మంత్రి ఉత్తమ్కు మార్రెడ్డి బనకచర్లపై పీపీటీ ఇవ్వనున్నారు. సీఎం రేవంత్ ముఖ్య అతిధిగా పాల్గొనను న్నారు.

**హైదరాబాద్, జూన్ 17:** గోదావరి–బనకచర్ల లింక్‌ప్రాజెక్టు విషయంలో వపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తదుపరి అనుసరించాల్సిన కార్యాచరణ కోసం తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను గౌరవ అతిథు లుగా ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రె స్, భాజపా, భారాస, మజ్లిస్ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు రాయడంతోపాటు స్వయంగా ఫోన్ చేసిన ఆహ్వానించామని తెలిపారు. 'ట్రైబ్యునల్, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై

మిగతా 2 లో



03


## ఒకేరోజు ఏడు ఎయిర్ ఇండియా విమానాల రద్దు

సాంకేతిక కారణాలతో రద్దు చేసినట్లు వెల్లడి

## ఆ 'అమీన్ సాబ్' అంతే! అదో టైపు!

నచ్చని విలేకరులపై కోరుట్ల ఎస్సై కక్ష

వివరాలు అడిగితే 'పోలీస్-ప్రెస్' గ్రూప్ నుంచి తొలగింపు




06



## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు
- ఇది ప్రాజస్వామ్య సూత్రాలకు విరుద్ధం
- మావోలతో వెంటనే శాంతి చర్చలు జరపాలి
- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు

03



## సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అందించండి

- ఫార్ములా కేసులో కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం

.. వివరాలు 2లో



## పార్టీ ఐక్యత కోసమే పనిచేశా

- కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ ప్రకటన

.. వివరాలు 3లో

## ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి

### వందలాది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఈ వ్యవహారంలో కెటిఆర్ సిగ్గుతో తలదించుకోవాలి
- జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చిన మహేశ్ కుమార్

02



## ఒకేరోజు 600మంది ఫోన్ల ట్యాప్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు
- నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో..
- జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్
- విచారణకు ప్రభాకర్ రావు

02




02

## అభివృద్ధిని ఓర్వని బీఆర్ఎస్

పదేళ్ల అధికారంలో ఉండగా అప్పులు చేసి పోయారు

- కరెంట్ అప్పలు కూడా నెత్తిన వేశారు
- డిమాండ్‌కు తగ్గకుండా విద్యుత్ సరఫరా చేశాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..



# ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి



**హైదరాబాద్, జూన్ 17:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ సిగ్గుతో తలదించుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనా డు అధికారంలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌లు వేలాదిమంది కాంగ్రెస్ నేతల ఫోన్లు టాప్ చేశారని అన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం టీపీసీచీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబట్టి తమ ఫోన్‌లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సీఎం, కేటీఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని వ్యాఖ్యలు చేశారు. ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దుర్బుద్ధితో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మూమెంట్స్ అన్ని కూడా ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. మ ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందాలని చూశారని ఆరోపించారు. నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి వినతి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమమన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లలతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్కలను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# పార్టీ ఐక్యత కోసమే పనిచేశా

## తెలంగాణలో అధికారం దక్కాలన్నదే ఆకాంక్ష..

## కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ ప్రకటన

**హైదరాబాద్, జూన్ 17:** పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుపడాలి, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలనేది తన లక్ష్యమని ఎమ్మెల్యే రాజాసింగ్ పునరుద్ఘాటించారు. తానెప్పుడూ వ్యక్తిగత లబ్ది లేదా పదవుల కోసం పని చేయలేదని స్పష్టం చేశారు. తన కృషి ఎప్పుడూ పార్టీని బలోపేతం చేయడం, పార్టీ ఆదర్శాలను అంకితభావంతో పనిచేయడంపైనే తాను దృష్టి పెట్టానని అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. పార్టీలో అందరికీ తగిన గౌరవాన్ని ఇస్తూ, ఈ విషయంపై తాను నేరుగా స్పందించాలనుకుంటున్నానని తెలిపారు. తన ఉద్దేశ్యం ఎప్పుడూ సరళంగా, నిష్కల్మషంగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనను రాజాసింగ్ విడుదల చేశారు. అయితే, తెలంగాణలోని అన్ని 119 నియోజకవర్గాల్లో ఎలా విజయం సాధించడానికి బదులుగా, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని, తనను విడదీసి, అడ్డంకులు సృష్టిస్తున్నారని.. అయినప్పటికీ తాను పార్టీకి అంకితమైన, నిస్వార్థ సేవ చేశానని రాజాసింగ్ చెప్పారు. పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభమని రాజాసింగ్ ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డానని గుర్తుచేశారు. ఈ రోజు తాను తన కోసం కాకుండా, పార్టీ ఐక్యతకు, అదే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న లక్షలాది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవటం కోసం మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి తమకు కొంత సమయం కేటాయించాలని కోరారు. తాను, పార్టీ సహచరులు మీతో వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తామని చెప్పారు. కిషన్‌రెడ్డి ఎక్కడైనా, ఎప్పుడైనా సమావేశం నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాము పార్టీని విభజించడానికి కాదని, ఐక్యతను తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. పార్టీ నిజమైన లక్ష్యాన్ని మనం మరచిపోకూడదని చెప్పారు. తెలంగాణకు బీజేపీ ప్రభుత్వం అవసరమని అన్నారు. వ్యక్తిగత విభేదాలను విడిచిపెట్టి, ఐక్యంగా పని చేద్దామని రాజాసింగ్ కోరారు.

# 'యోగా డే'లో పెద్ద ఎత్తున పాల్గొనండి

## యోగా సందేశంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జూన్ 17:** యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

# సీఎంను కలిసిన మంత్రి వివేక్



**హైదరాబాద్, జూన్ 17:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్‌లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్‌కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు.

# గోదావరి-బనకచర్ల వివాదం

**హైదరాబాద్, జూన్17:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం రేపు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కీలక భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానాలు పంపామని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రైబ్యునల్ తీర్పులకు, చట్టాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని చూస్తోంది. ఈ విషయంపై మేము ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మా అభ్యంతరాలను తెలియజేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను కూడా కేంద్రానికి లేఖలు రాశాం. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల నీటి హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించాం" అని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. "ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకుగాను ఎంపీలందరి అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించాం. అందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని ఆయన స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌కు ఇప్పుడే ఉపఎన్నిక ఉండకపోవచ్చు

## సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జూన్ 17:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఇప్పట్లో నోటిఫికేషన్ ఉండకపోవచ్చని, రెండు, మూడు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే వచ్చిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పుడే ఉండకపోవచ్చని తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ తమకు గెజిట్ పంపించిందని గుర్తుచేశారు. ఆ గెజిట్ తాము యథాతథంగా కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించామని అన్నారు. జూబ్లీహిల్స్‌లో డిసెంబర్ వరకు కొత్త ఎమ్మెల్యే ఎన్నిక జరగాలని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చాలా సంస్కరణలను తీసుకువస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్స్, ఈఆర్‌ఓలతో ఇంటరాక్ట్ కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. వీరికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లలో మినిమం ఓటర్ల సంఖ్యను 1200కు కుదించిందని గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలను 200 మీటర్ల నుంచి కిలో మీటర్ వరకు పెంచిందని వెల్లడించారు సీఈఓ సుదర్శన్ రెడ్డి. పోలింగ్ కేంద్రానికి కిలోమీటర్ వరకు పార్టీలు ప్రచారం చేయడానికి వీలు లేదని సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. పోలింగ్ సెంటర్స్ వద్ద ఇక నుంచి మొబైల్ ఫోన్స్ కోసం డిపాజిట్ ఫెసిలిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈనెల(జూన్) 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ఃఒం, ఃఒక్షలకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇస్తోందని చెప్పారు. నేషనల్ లెవెల్ లీగల్ కాన్ఫరెన్స్ కోసం ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇస్తోందని అన్నారు. రూరల్‌లో 87శాతం, అర్బన్‌లో 67శాతం ఓటర్, ఆధార్ కార్డ్ లింక్ జరిగిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఒకేరోజు 600మంది ఫోన్ల ట్యాప్

## నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్

## జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్

## మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు

**హైదరాబాద్, జూన్ 17:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళ్తుంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

# అభివృద్ధిని ఓర్వని బీఆర్ఎస్

## పదేళ్ల అధికారంలో ఉండగా అప్పులు చేసి పోయారు

## ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 17:** రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే బిఆర్ఎస్ పార్టీ ఓర్వలేకపోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నేతలు బయటకి వచ్చినప్పుడు తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం సంపాదించిన ప్రతి రూపాయిని ప్రజలకు ఖర్చు పెట్టాలనే ఆలోచన చేస్తుంది.. గతంలో సంపాదించిన ప్రతి రూపాయిని దోచాలని ఆలోచనతో ఉండేవాళ్లు అని ఆయన ఎద్దేవా చేశారు. అందుకే ఈ రాష్ట్రం అభివృద్ధి జరగలేదు, ఇక్కడ ప్రజల స్థితిగతుల్లో మార్పు జరగలేదు అన్నారు. ఇది గమనించిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్నికి అధికారంలోకి తీసుకొచ్చారని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీధర్ బాబుతో కలసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో రైతులు వాడిన విద్యుత్ కు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టిన వాటిని కూడా ఈ ప్రభుత్వం చెల్లించి.. ఉచిత కరెంటు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రూ. 38 వేల కోట్ల నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్లకు పెంచి.. అందిన కాడికి దోచుకున్నారు.. ఆ ప్రాజెక్టు ఇప్పుడు పనికి రాకుండా పోయింది అని భట్టి పేర్కొన్నారు. సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరని, ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని గత పాలకులు దుష్ప్రచారం చేశారు. ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సౌర శక్తి ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మహిళా సంఘాలకు ఇవ్వడానికి సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గోదావరి నది జలాలకు సంబంధించి ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్ర వాళ్ళు తెలంగాణ రాష్టానికి నీరు ఇచ్చిన తర్వాతే మీరు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు మా రాష్టానికి నీరు ఇచ్చిన తర్వాతే పక్కా రాష్టాలకు నీటిని తరలించాలని అప్పుడే చెప్పామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

# సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అందించండి

## ఫార్ములా కేసులో కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం




**హైదరాబాద్, జూన్ 17:** ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. సోమవారం ఫార్ములా ఈ కేసులో ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు వేసిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయన వాగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈ విచారణ అనంతరం కేటీఆర్ వాడిన సెల్‌ఫోన్, మ్యాక్‌బుక్, ట్యాబ్‌లో కీలక సమాచారం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కేటీఆర్, అధికారులకు ఆదేశాలు ఇచ్చారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కేటీఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను పరిశీలించేందుకు ఏసీబీ నిర్ణయించింది. కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా డాక్యుమెంట్లను రెడీ చేస్తున్న ఏసీబీ అధికారులు.. రేపటిలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో న్యాయ సలహా ప్రకారం నడుచుకుంటానని కేటీఆర్ పేర్కొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం 18 జూన్ 2025 హైదరాబాద్


# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు
- ఇది ప్రాజస్వామ్య సూత్రాలకు విరుద్ధం
- మావోలతో శాంతి చర్చలు జరపాలి
- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు



**హైదరాబాద్, జూన్ 17:** ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు.అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువలని ప్రశ్నించారు. ఇదేనా రామరాజ్యం అంటే? ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..

# తప్పులు తడకగా కులగణన

### గొప్ప ఘనకార్యం చేసామని చాటింపు

### బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్

**హైదరాబాబాద్,జూన్ 17 :** తెలంగాణలో కులగణన తప్పుల తడకగా సాగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.. సర్వే చేసే వారు మా ఇంటికే రాలేదు. బీసీల జనాభా ఎలా తగ్గింది? బీసీల్లో మైనార్టీలను చేర్చడాన్ని భాజపా వ్యతిరేకించిందన్నారు. దీనిని గోరంతలు కొండంతలు చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రభుత్వంలోకి వచ్చింది. కాంగ్రెస్‌లో జరిగిన అభివృద్ధి కన్నా రెండింతల అభివృద్ధి మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. భాజపా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల కల.. పసుపు బోర్డు నిజామాబాద్‌కు వచ్చిందని, జనగణనతోపాటు కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. ప్రభుత్వ పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం అందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి..ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ఇళ్లు కేటాయించిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్ విమర్శించారు. 'తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో 2,700 ఇళ్లు కట్టారు. ఆ ఇళ్లను స్థానికులకు కాకుండా దాదాపు 2,500 ఇళ్లను హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒకే మతానికి చెందిన వారికి ఇచ్చారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేస్తే.. న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. ఇళ్ల కేటాయింపు ఇల్లీగల్ అని పేర్కొంది. ఈ తీర్పు అన్ని ప్రాంతాల్లో కేటాయించిన వారికి వర్తిస్తుంది. స్థానికులకే ఇళ్లు కేటాయించాలని వీరేందర్‌రెడ్డి అన్నారు.

# అక్రమంగా అమ్ముతున్న డిఫెన్స్ మద్యం పట్టివేత

**హైదరాబాద్, జూన్ 17:** హైదరాబాద్ నగరంలో డిఫెన్స్ మద్యం పట్టుబడింది. మల్కాజిగిరిలో 37 బాటిళ్లు, మేడ్చల్‌లో 24 బాటిళ్ల మద్యంను అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ పర్సన్ ను అరెస్ట్ చేశారు. ఎక్స్ ఆర్మీకి చెందినటువంటి ఇద్దరూ వ్యక్తులు రెండు చోట్ల మద్యం అమ్మకాలు జరుపుతున్నారు అనే సమాచారం మేరకు మల్కాజిగిరి ఏఈఎస్ ముకుంద రెడ్డి బృందం రెండుచోట్ల దాడి చేసి 37 డిఫెన్స్ మద్యం బాటిల్లను సీజ్ చేశారు. పట్టుబడినటువంటి మద్యం బాటిళ్లు కర్ణాటక చెందినవిగా గుర్తించారు. డిఫెన్స్ క్యాంటీన్ లో నెలవారీగా వచ్చే కోటాను కొంతమంది వద్ద బాటిల్లను కొనుగోలు చేసి ఎక్స్ సర్వీస్ మెన్ పురుషోత్తం యాప్రాల్‌లో, ముప్పరపు సిద్దయ్య ఆర్మీ పర్సనల్ కౌకూర్‌లో అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నట్లు ఏఎస్‌బి ముకుందరెడ్డి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ 75 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్స్ పట్టుకున్న వారిలో ఏఈఎస్ ముకుంద రెడ్డితో పాటు సీఐ భరత భూషణ్ డిటిఎఫ్ ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డిలు సిబ్బంది ఉన్నారు. మద్యం బాటిల్ పట్టుకున్నటువంటి సిబ్బందిని ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ అభినందించారు. మేడ్చల్ ఈఎస్ పరిధిలో హర్యానాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చేటువంటి లేబర్ వారు తీసుకొచ్చుకునేటువంటి మద్యం బాటిల్లను మేడ్చల్ సిఐ నవనీత ఏఈ ఎస్ మాధవయ్య డిటిఎఫ్ నర్సిరెడ్డిలు సిబ్బంది కలిసి వాహనాలు, బస్సులు నిలిపే ప్రాంతాల్లో తనిఖీలు చేసి 24 మద్యం బాటిల్లను సీజ్ చేసినట్లు మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిల్లో విలువ రూ. 48 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్లను పట్టుకున్నటువంటి సిబ్బందిని సిఐని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె ఫయాజుద్దీన్ అభినందించారు.

# స్థానిక ఎన్నికలపై ఫీవర్

### పలకరింపులతో హల్‌చల్

నిజామాబాద్, జూన్ 17: బీసీ గణనకు సంబంధించి కమిషన్ల రిపోర్టులు ఆధారంగానే రిజర్వేషన్లు పెంచి లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహుశా జూలైలో స్థానిక ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉందంటూ వార్తలు వస్తున్నాయి. 42శాతం బిసి రిజర్వేషన్లు ప్రకటించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇవిప్రకటించి చిత్తశుద్ధి చాటుకోవాలని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్లు ప్రకటించకుండా స్థానిక ఎన్నికలకు వెళితే ఊరుకోమని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. ఇకపోతే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. స్థానిక ఎన్నికల్లో ఫుట్‌బాల్ ఆడుతామని కెటిఆర్ ప్రకటించారు. తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రకటించారు. తాజాగా జిల్లాలో 14,35,214 మంది ఓటర్లుండగా పురుషులకన్నా 80,875 మంది మహిళా ఓటర్లు ఎక్కువ ఉన్నట్టు లెక్క తేలింది. మహిళల తర్వాత యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారు 26 వేల వరకు ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువతీయువకులే దాదాపు సగం వరకు ఉన్నారు. కొత్త జాబితా ప్రకారం 18 నుంచి 39 ఏండ్ల మధ్య వయస్సున్న ఓటర్ల సంఖ్య 6,



96,014. దీంతో రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలు, యువతే కీలకం కానున్నారు. దీంతో యువతలో కూడా సర్పంచ్ పదవులపై ఆశ కనిపిస్తోంది. పంచాయితీలతో పాటు వాటి పరిధిలోని 5,022 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ బాక్స్ లతో పాటు పేపర్ బ్యాలెట్ రెడీ చేశారు. జిల్లాలో 31 మండలాలున్నాయి. పంచాయతీ ఎన్నికల తర్వాత ఈ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలన్నింటి లోనూ యువత, మహిళలే నిర్ణేతలు కానున్నారు. వారు ఎవరివైపు మొగ్గు చూపితే వాళ్లే అందలమెక్కే చాన్స్‌ఉందని అంటున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. జులైలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు కూడా మాజీలయ్యారు.మున్సిపల్ కార్పొరేషన్లు, కౌన్సిళ్ల టర్మ్ పూర్తికానుంది. దీంతో రూరల్, అర్బన్ లోకల్ బాడీలకు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా 15 గ్రామ పంచాయ తీలు ఏర్పడడంతో జిల్లాలో పంచాయితీల సంఖ్య 545 పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలో అప్పుడే స్థానిక హడావిడి మొదలయ్యింది. ముఖ్యంగా పంచాయితీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే వారంతా ఇప్పటి నుంచే గ్రామాల్లో కరచాలనాలు మొదలు పెట్టారు. పలకరింపులు చేస్తున్నారు. బాగున్నావా అని ఆత్మీయంగా చూస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాల సందర్భంగా గ్రామాల్లో ఇదే సందడి కనిపించింది. వాడు సర్పంచ్‌కు పోటీ చేస్తున్నాడనే కామెంట్స్ కూడా బాగానే వినిపించాయి. ఇకపోతే జిల్లాలో మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు బాన్సువాడ సెగ్మెంట్‌లోని కొన్ని మండలాలున్నాయి.




# ఒకేరోజు ఏడు ఎయిర్ ఇండియా విమానాల రద్దు

### సాంకేతిక కారణాలతో రద్దు చేసినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 17:** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా దుర్ఘటన తర్వాత, మంగళవారం ఏకంగా 7 విమానాలను రద్దు చేశారు. రద్దు చేసిన విమానాల్లో 6 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైన్ విమానాలు ఉన్నాయి. ఇటీవల, అహ్మదాబాద్ లో ప్రమాదానికి గురైంది ఈ రకం విమానమే. ముందుగా, సాంకేతిక లోపాల కారణంగా అహ్మదాబాద్ -లండన్, ఢిల్లీ-పారిస్ విమానాలను మంగళవారం రద్దు చేశారు. దీని తర్వాత, లండన్-అమృత్‌సర్, బెంగళూర్-లండన్ విమానాలు కూడా రద్దయ్యాయి. మా ప్రయాణీకులకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాము మరియు వీలైనంత త్వరగా వారిని వారి గమ్యస్థానానికి చేర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాము. మేము హోటల్ వసతిని అందిస్తున్నాము. ప్రయాణీకులు రద్దు చేసుకుంటే ఉచిత రీషెడ్యూలింగ్‌పై పూర్తి వాపసులను కూడా అందిస్తున్నాము' అని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. గత వారం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో 242 మందిలో ఒకరు మినహా అందరూ ప్రాణాలు కోల్పోయారు. విమానం డాక్టర్స్ హాస్టల్‌పై కుప్పకూలడంతో నేలపై చుట్టుపక్కల ఉన్న 33 మంది వరకు మరణించారు.

# విమాన ప్రమాదంతో విద్యార్థుల ఉక్కిరిబిక్కిరి

### మూడో అంతస్థు నుంచి దూకిన వీడయో వైరల్

**అహ్మదాబాద్, జూన్ 17:** జూన్ 12వ తేదీన అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఒక వ్యక్తి మినహా ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న అందరూ ప్రాణాలు కోల్పోయారు. అయితే విమానం బిజె మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాన్ని ఢీకొట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం నుంచి తప్పించుకొనేందుకు కొందరు విద్యార్థులు బాల్కనీల నుంచి బయటకు దూకుతున్న వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. బిజె మెడికల్ కాలేజీ భవనాన్ని విమానం ఢీకొన్న వెంటనే భారీగా శబ్దం వచ్చింది. దీంతో భయపడిపోయిన విద్యార్థులు మూడో అంతస్థు బాల్కనీకి బెడ్‌షీట్లను కట్టి.. తమ ప్రాణాలు కాపాడుకొనేందుకు కిందకు దూకేశారు. అక్కడ ఉన్న స్థానికులు ఆ దృశ్యాలను వీడియో తీశారు. ఒకవైపు ప్రాణాలు కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో.. ప్రాణాలకు తెగించి విద్యార్థులు ఈ సాహసం చేశారని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



# హైదరాబాద్ నుంచి నేరుగా ఇథియోపియా సర్వీస్

**హైదరాబాద్, జూన్ 17:** హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు నేరుగా మొట్టమొదటిసారి విమాన సర్వీసు ప్రారంభమైంది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాకు నాన్-స్టాప్ సేవలను ప్రారంభించారు. దీంతో హైదరాబాద్ గ్లోబల్ కనెక్టివిటీ మరింత బలపడింది. ఈ సేవలను ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ నిర్వహిస్తోంది. అడ్డిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సోమ, బుధ, శుక్రవారాల్లో.. హైదరాబాద్ నుంచి అడ్డిస్ అబాబాకు మంగళ, గురు, శనివారాల్లో సర్వీసులు నడపనున్నారు. ఈ విమాన సర్వీసుతో అడ్డిస్ ఇథియోపియాతో భారత వ్యాపార, పర్యాటక ప్రయాణికులకు మరింత అనుకూలత లభించనుంది. మరోవైపు భారత్‌లో వైద్యం చేయించుకునేందుకు ఆఫ్రికాలోని ఇథియోపియా, నైజీరియా, టాంజానియా, ఉగాండా, రువాండా, జాంబియా, కేమరూన్, కెన్యా దేశాల నుంచి అనేక మంది రోగులు వస్తుంటారు. అలాంటి వారికి ఈ విమాన సర్వీసు ఉపయుక్తంగా ఉండనుంది.

# నిత్యం నరకం.. కన్న తండ్రి హతం

### సహించలేక యువతి ఘాతుకం

**నిజామాబాద్, జూన్ 17:** తల్లి, అక్కను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఓ యువతి.. కన్న తండ్రిని హత్య చేసింది. నిత్యం నరకం చూపడాన్ని సహించలేక ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలం ధర్మారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నర్సయ్య (54)కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పెళ్లి అయి విడాకులు తీసుకుని పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో నర్సయ్య.. తన భార్య, పెద్ద కుమార్తెతో తరచూ గొడవ పెట్టుకోవడమే కాకుండా శారీరకంగా హింసించేవాడు. మంగళవారం కూడా నర్సయ్య గొడవ పడటంతో తల్లికుమార్తెలిద్దరూ ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన చిన్న కుమార్తెతో నర్సయ్య అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విసిగిపోయిన ఆమె రోకలి బండతో తండ్రి తలపై మోది హత్య చేసింది. సమీప బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమెను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.



# అప్పులు.. కేసులు.. దబాయింపులు!

ఉమ్మడి ఎపి రాష్ట్రాన్ని విడదీసిన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరిందా అంటే లేదనే చెప్పాలి. ఉమ్మడి ఎపికన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం ఏర్పడ్డదే తమ అధికారం కోసం అన్నరీతిలో తెలంగాణలో దాదాపు పదేళ్ల పాటు టిఆర్ఎస్ లేదా బిఆర్ఎస్ రాజ్యమేలింది. ఐదేళ్లపాటు జగన్ కూడా ఎపిని సర్వనాశనం చేసి, అన్నింటా అవినీతిని జొప్పించారు. ఇలా దోపిడీ రాజ్యం నడిచింది. తెలుగు రాష్ట్రాల్లో దోపిడీని ప్రజలు పట్టించుకోకుండా పందేరాలకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్పను చేసింది. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేసింది. కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు గోదాట్లో పోసారు. ఇది పనికిరాని ప్రాజెక్ట్ అంటూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఇది వయబుల్ కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ పదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపెంకం,చేపల పెంకం, రైతుబంధు, ఈ కార్ రేసు వంటివన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇందులో పెట్టిన డబ్బులన్నీ స్వార్థానికి వాడుకున్నారు. కోట్లల్లో అవినీతి జరిగింది. దీనిపై విచారణ కూడా సీరియస్‌గా సాగడం లేదు. ఏడాదిన్నరయినా ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కూసూ తేలడం లేదు. ఇవన్నీ మరచిపోయి కెటిఆర్ సవాళ్లు విసురుతున్నారు. హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు. కవిత ఒంటికాలు మీద లేస్తున్నారు. మా నాయనకు నోటీసులు ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్ప ఇతరులు పాలనకు పనికిరారన్న రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి కేసులు పెడితే ధైర్యంగా ఎదుర్కోవాలి. నిజాయితీ నిరూపించుకోవాలి. కానీ నిగగ్గదీస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసరుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్‌ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ. 45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ. 46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది. జగన్ కూడా ఎపిలో కూటమి విఫలం అయ్యిందని విమర్శలు మొదలు పెట్టారు. అప్పులు చేసి ఏం చేశారో చెబితే బాగుండేది. కానీ అలాకాకుండా అధికారం కోసం ఇప్పటి నుంచే తనవంతుగా ఎదురుదాడి యత్నాలకు శ్రీకారం చుట్టారు. రాజకీయ అవినీతిని విచారించేందుకు లోక్‌పాల్ లాంటి సంస్థలే శరణ్యం. ఈ దిశగా అడుగులు పడాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.

# అహ్మదాబాద్-లండన్ విమానంలో సాంకేతిక సమస్య

## అత్యసవరంగా అండన్ విమానం నిలిపివేత



**న్యూఢిల్లీ, జూన్ 17:** దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాలో వరుస ఘటనలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సంస్థకు చెందిన బోయింగ్ డ్రీమ్ లైనర్ విమానం ఇటీవల లండన్ వెళ్తుండగా అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఘటన మరవకముందే.. మరిన్ని విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడటం కలవర పెడుతోంది. తాజాగా అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో విమానంలోనూ సాంకేతిక సమస్య ఎదురైంది. టేకాఫ్‌కు ముందే సమస్యను గుర్తించడంతో ఈ సర్వీసును రద్దు చేశారు. ఎయిరిండియా ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే విమానంలో తనిఖీలు చేస్తుండగా.. సాంకేతిక సమస్యను గుర్తించారు. దీంతో టేకాఫ్ నిలిపివేసి సర్వీసును రద్దు చేశారు. గత వారం నాటి విమాన ప్రమాదం తర్వాత లండన్‌కు వెళ్లాల్సిన తొలి షెడ్యూల్డ్ విమానం ఇదే కావడం గమనార్హం. జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఏఐ 171 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం క్షణాల వ్యవధిలోనే కుప్పకూలి దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒకేఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఇక విమానం నివాస సముదాయంపై పడటంతో మరో 33 మంది మృతి చెందారు. ఈ ఘటన తర్వాత ఎఐ171 విమానం నంబర్‌ను ఎయిరిండియా పక్కనబెట్టింది. దాని స్థానంలో ఏఐ 159 నంబరును వినియోగించింది. ఇప్పుడదే సిరీస్ విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. మరోవైపు, ఈ ఘటన తర్వాత పలు ఎయిరిండియా విమానాల్లో సాంకేతిక లోపాలు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ ఉదయం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ముంబయి వెళ్తున్న ఏఐ 180 విమానంలో సమస్య రావడంతో దాన్ని కోల్‌కతాలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులను దించేసి తనిఖీలు చేపట్టారు.

# పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత

## జీ7 సదస్సును వీడిన అమెరికా అధ్యక్షుడు
## హుటాహుటిన స్వదేశం యూఎస్‌కు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా స్వదేశం బయలుదేరి వెళ్లారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్ర యాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా అధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఆ నగరవాసులు నివాసాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగిరావడంతో.. అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సి ఉంటుంది. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియాగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం. మరోవైపు, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. 'నేను జీ7 సదస్సును ఎందుకు వీడుతున్నానో మేక్రాన్ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను వాషింగ్టన్ ఎందుకు వెళ్తున్నానో ఆయనకు తెలియదు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి కాదు.. అంతకంటే పెద్దదే జరగబోతోంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. నతాంజ్, ఫార్డో అణు కేంద్రాలు భూగర్భంలో లోతుగా నిర్మించారు. వీటిని పేల్చేయాలంటే అత్యంత భారీ శ్రేణికి చెందిన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులు అవసరం. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. ఇరాన్‌లోని ఫార్డో అణుకేంద్రంలో యురేనియంను 60 శాతం శుద్ధి చేయగలరు. ఇది అణుబాంబులు తయారీ చేయడానికి అవసరమైన దానికి చాలా సమీపంలో ఉన్నట్లే లెక్క. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ కేంద్రంలో 83.7శాతం శుద్ధి చేసిన యురేనియంను గుర్తించింది. అణుబాంబుకు అవసరమైన 90 శాతానికి ఇది చాలా దగ్గరగా ఉంది. ఫార్డో కేంద్రాన్ని ఓ పర్వతం లోపల సొరంగాలు చేసి నిర్మించారు. ఇక్కడ 3,000 సెంట్రిఫ్యూజులు ఉన్నట్లు అంచనా. దీనిని సాధారణ బాంబులు ధ్వంసం చేయలేవు. ఇరాన్ నుంచి అణుబాంబు తయారీని దూరం చేయాలంటే దీనిని ధ్వంసం చేయడం అమెరికా, ఇజ్రాయెల్‌కు చాలా ముఖ్యం.

# 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

## అంతవరకు విశ్రమించేది లేదు
## రౌంట్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



మెదక్, జూన్ 17: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతామని అన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇది రాజకీయ వేదిక కాదు.. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ బిల్లు పంపామని తమకు ఏం సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అనడం సరికాదని చెప్పారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో చిత్తశుద్ధి లేదని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. బీసీ బిల్లు సాధనకు కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడానికి జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం తేలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెడతామనడం సరికాదని అన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఆపుతామని చెప్పారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితే బీసీ బిడ్డల కాళ్ల వద్దకు పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఇదిలావుంటే కవిత పర్యటనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డిలు దూరంగా ఉన్నారు.

# మూడెకరాల రైతులకు తొలుత రైతుభరోసా

## 1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేశాం: తుమ్మల

**ఖమ్మం, జూన్ 17:** తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. మంగళవారం 1,551.89 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు 3 ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వెల్లడించారు. అయితే, అందుకోసం 1551.89 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు.



# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

## అత్యసవరసరంగా నాగ్‌పూర్‌లో ల్యాండింగ్

**ముంబై, జూన్ 17:** విమానాల్లో సాంకేతిక సమస్యలు, బాంబు బెదిరింపులు ఇటీవలే కాలంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గతవారం అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం అనంతరం ఇలాంటి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. తాజాగా కేరళ రాష్ట్రం కొచ్చి నుంచి దేశ రాజధాని ఢిల్లీ వెళ్తున్న ఓ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఇ 2706 విమానం మస్కట్ నుంచి కొచ్చి మీదుగా ఢిల్లీ వెళ్తోంది. అయితే, విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే విమానాన్ని నాగ్‌పూర్‌ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అక్కడ ప్రయాణికులందరినీ కిందకు దింపి.. తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదని నాగ్‌పూర్ డీసీపీ లోహిత్ మతాని తెలిపారు.

# కులగణనపై గళమెత్తిన రాహుల్

## బీసీ శాఖ కోరినా ఇవ్వని మోడీ: విహెచ్



**హైదరాబాద్, జూన్ 17:** కుల గణనపై ఎవరు మాట్లాడనప్పుడే రాహుల్ గాంధీ మాట్లాడారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు పేర్కొన్నారు. ఎవరు ఎంతో, వారికి అంత అని చెప్పారు.. ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని మూడుసార్లు కలిసి బీసీలకి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఇవ్వమని కోరినా ఇవ్వలేదు.. జన గణనతో మాకు వచ్చే లాభం లేదు అని తేల్చి చెప్పారు. కుల గణన చేస్తే మాకు మంచిది.. రాహుల్ గాంధీ అగ్రకులంలో పుట్టినా బీసీలకు న్యాయం చేయాలని మాట్లాడారు.. మోడీ బీసీ అయినా, కుల గణన చేయడానికి ఆలోచిస్తున్నాడు అని ఎద్దేవా చేశారు. జన గణనతోనే కుల గణన చేయాలి అని వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. ఇక, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖతో పాటు కుల గణన చేయాలని వీహెచ్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎంపీలు నోరు విప్పాలి.. లేదంటే, ఎంపీల ఇంటి ముందు ధర్నా చేస్తాను అని హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే బీసీలకు న్యాయం చేసింది.. అలాగే, కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టి బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను అందజేయాలని అన్నారు.

# ఆగస్టు 15 నుంచి చీరల పంపిణీ



- వస్త్ర పరిశ్రమ సొసైటీలు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలి
- జూన్ చివరి నాటికి 50శాతం చీరల ఉత్పత్తి పూర్తిచేయాలి
- చీరల ఉత్పత్తి పురోగతిపై సమీక్ష
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- హాజరైన చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్

**నేటి సాక్షి, సిరిసిల్ల:** వస్త్ర పరిశ్రమ సొసైటీలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని, చీరల ఉత్పత్తి ఆర్డర్ సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి మ్యాక్స్ సంఘాల సభ్యులు, ఆసాములతో చీరలు ఉత్పత్తి పురోగతి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా చీరల ఉత్పత్తి ఆర్డర్ పూర్తిచేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి ఆర్డర్ ద్వారా వస్త్ర పరిశ్రమ కార్మికులకు 8 నెలల పాటు ఉపాధి లభిస్తుందన్నారు. మిగిలిన నాలుగు నెలలు కూడా ఉపాధి లభించే విధంగా ప్రభుత్వం తరఫున ఇతర శాఖల నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్లు నేత కార్మికులకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తిచేసి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

## వేగవంతం చేయాలి

ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాల సభ్యులకు 2 చీరలు పంపిణీ చేసేందుకు నిర్ణయించిందన్నారు. మొదటి చీర పంపిణీ చేసేందుకు సిరిసిల్లలోని 131 మ్యాక్స్ సొసైటీ పరిధిలోని 16,424 పవర్ లూమ్స్‌కు 4 కోట్ల 30 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్‌ను జనవరి, మార్చి నెలలో రెండు దశల్లో అందించిందని అన్నారు. మొదటి దశ 2 కోట్ల 12 లక్షల మీటర్ల చీరలు ఉత్పత్తి ఆర్డర్‌కు ఇప్పటివరకు సిరిసిల్ల చేనేత సొసైటీ నుంచి 50 లక్షల 55 వేల మీటర్ల ఉత్పత్తి పూర్తి చేశారన్నారు. ఆగస్టు 15 నుంచి చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని, చీరల ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత మ్యాక్స్ సంఘాల సభ్యులకు సూచించారు. 45 రోజుల గడువులో 3.5 కోట్ల మీటర్ల చీర ఉత్పత్తి చేయాలని, ప్రతి సొసైటీ పరిధిలో ఉన్న పవర్ రూమ్స్ పూర్తి స్థాయిలో చీరల ఉత్పత్తి చేయాలని, రోజూ ఉదయం, రాత్రి షిఫ్టుల్లో పని చేయాలన్నారు. పవర్ లూమ్స్ లలో కార్మికుల సంఖ్య పెంచాలని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పాత బకాయిలను దాదాపు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేశామని, ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని శాఖల నుంచి బట్ట ఉత్పత్తి ఆర్డర్లు చేనేత సొసైటీలకు వస్తుందని, స్కూల్ , అంగన్‌వాడీ ఏకరూప దుస్తులు ఆర్డర్ అందించామని, రాబోయే రోజుల్లో దేవాదాయ శాఖ నుంచి కూడా మరో ఆర్డర్ వస్తుందని వివరించారు.

## ఆర్డర్ చాలా పెద్దది

ఇందిరా మహిళా శక్తి క్రింద ప్రభుత్వం అందించే ఆర్డర్ చాలా పెద్దదని, దాదాపు ఏడాదికి 9 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయాల్సి ఉంటుందన్నారు. సొసైటీలు చీర ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో ఆర్డర్ పూర్తిచేయాలన్నారు. ప్రతి సొసైటికి కేటాయించిన లక్ష్యంలో కనీసం 50 శాతం జూన్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని, లేదంటే సంబంధిత సొసైటీ ఆర్డర్ రద్దు చేసి 50 శాతం పూర్తి చేసిన సొసైటీలకు ఆర్డర్ అందిస్తామని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన ఆర్డర్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిస్తున్నామని తెలిపారు. కార్మికులకు ప్రతి వారం 4వేల నుంచి 5 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం సొసైటీల వారీగా చీరల ఉత్పత్తి పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేసి వారి నుండి ఖచ్చితమైన ఆర్డర్ వివరాలను నమోదు చేశారు.

## టెక్స్‌టైల్ పార్క్ యజమానులతో సమావేశం

సిరిసిల్ల సమీపంలోని టెక్స్‌టైల్ పార్క్ యజమానులతో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా టెక్స్‌టైల్ పార్క్ యజమానులు తమకు ప్రభుత్వం నుంచి మరిన్ని వస్త్రం ఉత్పత్తి ఆర్డర్లు ముందస్తుగా ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. వివిధ శాఖలకు అవసరమైన ఆర్డర్స్ అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నాణ్యతతో వస్త్రాలు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ ఎన్. వెంకటేశ్వర్ రావు, ఏడీ రాఘవరావు, వివిధ మ్యాక్స్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, యజమానులు, ఆసాములు, టెక్స్‌టైల్ పార్క్ యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నల్ దాస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

## చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్

## కొనసాగుతున్న బాల కార్మికుల గుర్తింపు

**నేటి సాక్షి, ఆదిలాబాద్:** బడీడు పిల్లలు పనిలో కాదు పాఠశాలల్లో ఉండాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మికులను గుర్తిస్తున్నామని చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్‌పట్టణంలో ఆయా రెస్టాంటరెన్స్, పండ్లు, స్క్రాప్ దుకాణాల్లో తనిఖీ చేశారు. బాల కార్మికులను గుర్తించి తల్లిదండ్రులతో పాటు వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గుర్తించిన బడీడు పిల్లలను వారు ఉంటున్న కాలనీల్లోని సమీప ప్రభుత్వ పాఠశాలు, కేజీబీవీల్లో చేర్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను నిర్మిలించేందుకు బాలల పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. కలెక్టర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేసి వారిని గుర్తిస్తున్నామన్నారు. బడీడు పిల్లలను వారు ఉంటున్న కాలనీల సమీపంలో గల పాఠశాలల్లో చేర్పిస్తున్నామన్నారు. బడిబయట ఉండకుండా వారి భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వ్యాపారులు కూడా చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట పరంగా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను పాఠశాల్లో చేర్పించి వారికి విద్య బుద్దులు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అనిత, కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సుదీప్ రెడ్డి, అవుట్ రిచ్ వర్కర్ ఆశ్విని, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రామకృష్ణ, సీఆర్పీ భానుప్రకాష్, షూర్ ఎన్టీఓ జిల్లా కోఆర్డినేటర్ కే వినోద్, కానిస్టేబుల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# జూనియర్ డాక్టర్ల మెరుపు ధర్నా

## స్టయిపెండ్ కోసం కళాశాల ఎదుట బైఠాయింపు

## యాజమాన్యం హామీలో ఆందోళన విమరణ

**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్ శివారులోని ప్రతిమ మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్లు మంగళవారం మెరుపు ధర్నా చేశారు. తమకు రావాల్సిన స్టయిపెండ్‌ను యాజమాన్యం ఇవ్వకపోవడంతో కళాశాల ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా జూనియర్‌డాక్టర్లు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి నెలా తమకు రూ.25 వేలు స్టయిపెండ్‌చెల్లిస్తున్నా, ఆ డబ్బులను కళాశాల యాజమాన్యం తమకు ఇవ్వకుండా, వారే తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రేయింబవళ్లు కష్టపడుతున్నా, తమకు ఎలాంటి స్టయిపెండ్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంగా తమకు రావాలసిన స్టయిపెండ్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, మెడిసిటీ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు స్టయిపెండ్‌ఇవ్వకపోవడంతో విద్యార్థులు నిరసనలు తెలుపడంతో ఆ యాజమాన్యాలు స్టయిపెండ్‌ఇచ్చేందుకు ఒప్పుకున్నాయని గుర్తు చేశారు. త్వరలో స్టయిపెండ్‌జమ చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో జూనియర్‌డాక్టర్లు ఆందోళన విరమించారు.

# రేకుర్తిలో భూబకాసురులు

## ఏకంగా సర్వే నెంబర్లే పుట్టించిన కేటుగాళ్లు

## ఎమ్మెల్యే అనుచరుడు నందెల్లిపై కేసు నమోదు

## పరారీలో నిందితులు



**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్‌లోని రేకుర్తి రెవెన్యూ పరిధిలోని 18వ డివిజన్‌లో భూ బకాసురుల మరో బాగోతం బట్టబయలైంది. రేకుర్తి రెవెన్యూ పరిధిలో 230 మాత్రమే సర్వే నెంబర్లు ఉండగా, తాజాగా 231, 232, 233 అనే నెంబర్లతో ఏకంగా దొంగ సర్వే నెంబర్లను భూ మాఫీయా కొత్తగా సృష్టించింది. 227 సర్వే నెంబర్లో షేక్ సాజిదాకు చెందిన 19 గుంటల భూమినిపై దొంగ సర్వే నెంబర్లను సృష్టించి, నకిలీ భూ పత్రాలు తయారు చేయించి, ఆక్రమించిన అంశంలో కరీంనగర్ ఫతేపురాకు చెందిన షేక్ అబూబకర్ ఖాలీద్ ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ ఎమ్మెల్యే అనుచరుడు నందెల్లి మహిపాల్ పై ఏ1గా కేసు నమోదైనట్టు ఫిర్యాదుదారుడు మీడియాకు వెల్లడించాడు. ఫిర్యాదుదారుడి వివరాల ప్రకారం.. రేకుర్తి గ్రామ రెవెన్యూ శివారు సర్వే నెం.227లో విస్తీర్ణం 1.20 ఎకరాల భూమి 1954-55 కాస్రా పహాని ప్రకారంగా షేక్ సాజిదా, తన అమ్మమ్మ, తాతా షేక్ సాలం, భర్త షేక్ సాలెహ్ పేరిట పట్టా ఉంది. అప్పుడు సాజిదా తాత భూములు పంచగా, సర్వే.నెం. 227 పూర్తి విస్తీర్ణం 1.20 ఎకరాల భూమి, తన అమ్మ షేఖ్ బీ, తండ్రి షేక్ సాలెహ్ కి ఇచ్చారు. 1954-55 పహాని కాస్తూ కాలంలో హిస్సేదారీ అని కూడా మా అమ్మ పేరు నమోదు కాబడింది. ఆ తర్వాత మా అమ్మ పేరిట ఉన్న ఆస్తులు వారసులైన మేము పంచుకొనగా సర్వే. నెం.227 లో విస్తీర్ణం 1.20 ఎకరాల భూమిని, సాజిదా, తండ్రి సాలేహ్ కి వచ్చినది. తన సోదరుడైన షేక్ అబూబకర్ కు జీపీఏ ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా 2014-15 వరకు పహానిలో కూడా నమోదు అయ్యి వున్నారు. తేది: 18-01-2010 న డాక్యుమెంట్ నెం.10/2010 ద్వారా శేఖా సాజిదా నుండి, షేక్ అబూ బకర్ జీపీఏ తీసుకొని కాస్తూ చేపిస్తున్నారు. 2012లో అస్తపురం సాయిలు, అస్తపురం తిరుపతి, అస్తపురం మల్లయ్య, తన భూమి మొఖపైకి వచ్చి, ఆ భూమి వారిది అని అన్నారు. దీంతో తాను కొప్పడితే తిరిగి వెళ్లిపోయి, కోర్టులో తనమీద సూట్ వేయగా, 08-07-2019న జడ్జిమెంట్ తనకు అనుకూలంగా వచ్చిందన్నాడు. మళ్లీ అప్పీల్ వేసుకున్నారు. అయితే అప్పుడు తన పేర జీపీఏ ఉన్న భూ విస్తీర్ణం నుంచి 2014లో బండి రఘురాంకు 0.23 గుంటలు అమ్ముకోగా, మిగతా 0.37 గుంటల భూమి అప్పటి నుండి ఇప్పటి వరకు తన ఆధీనంలోనే ఉందన్నారు. ఈ మిగులు భూమిని కాజేయలనే దుర్బుద్ధితో నందెల్లి మైపాల్, బండిపెల్లి సురేందర్, బండారి మారుతి కలిసి పథకం ప్రకారం కుట్ర పన్ని, భూమి లేని వారికి భూమి ఉన్నట్టు సృష్టించి, అస్తపురం సాయిలు పేరిట 0.19 గుంటలు, అస్తపురం తిరుపతి పేరిట 0.19 గుంటలు, అస్తపురం మల్లయ్య పేరిట 0.21 గుంటలుగా చూయించి, ఇలా 1.19 ఎకరాల భూమిని దొంగ సర్వే నెంబర్లు వేసి (సర్వే నెం.లు 231, 232, 233) డాక్యుమెంట్ నెం.12965/2013 ద్వారా విక్రయ దస్తావేజు చేసుకొని దాదాపు పది సంత్సరాల తర్వాత అప్పటి అధికార బీఆర్‌ఎస్ పార్టీలో స్థానిక మంత్రికి అత్యంత సన్నిహితుడిగా కొనసాగుతున్న బలంతో తన సర్వే నెం.227లోకి 2023లో అక్రమంగా ప్రవేశించి బ్లేడ్ ట్రాక్టర్ తో భూమిని చదును చేస్తున్నారని సమాచారం అందగా, తక్షణమే తాను వెళ్లి, తన పని వారు రాజేందర్, మహబూబ్ ని మోఖా పైకి వెళ్లి పని ఆపమని చెప్పగా, వారు వారు అక్కడికి వెళ్లి పని ఆపమని చెప్పగా, నా పని వారిని నోటికి వచ్చినట్టు బూతులు తిడుతూ, మీ సార్ కి ఇక్కడ భూమి లేదు. ఇది మా భూమి మరొకసారి మీరు గానీ మీ సార్ గానీ భూమి దగ్గరికి వస్తే చంపి, ఇక్కడే పాతి పెడతామని బెదిరించారన్నాడు. తాను మార్చి 2024 లో కరీంనగర్ వచ్చిన తర్వాత సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోగా, 231,232, 233 సర్వే నంబర్లు రేకుర్తి రెవెన్యు రికార్డులో లేవని, 230 సర్వే నెంబర్ వరకే ఉన్నాయని తెలిసిందన్నారు. ఆ తర్వాత తాను భూమి దగ్గరికి ఎప్పుడు వెళ్లినా, తనను, తన పని వారిని వేధిస్తూ తమ భూమి ఇది.. మీకు భూమి లేదంటూ మా భూమిని కబ్జా చేయాలనే దుర్బుద్ధితో తనను ఇబ్బంది పెడుతున్నారని షేక్ అబుబకర్ ఖలీద్ పోలీసులను ఆశ్రయించాడు. దొంగ సర్వే నెంబర్లు వేసి దొంగ దస్తావేజులు తయారుచేసిన అంశంలో కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి కేసు నమోదు చేసినట్లు అబూబకర్ తెలిపాడు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..








# ఆ 'అమీన్ సాబ్' అంతే! అదో టైపు!

## నచ్చని విలేకరులపై కోరుట్ల ఎస్సై కక్ష







- ఇది ఎస్సై వెనుక 'అదృశ్యశక్తుల' కుట్రనా.? లేక 'అమీన్ సాబే' ఇలా చేస్తున్నారా?
- ఏడాది కాలంగా 'నిఖార్సైన వార్తలు' రాసేవారిపై చిన్నచూపు
- జేబులో 'తక్కెడ'.. నోట్లో 'గులాబ్ జామూన్' పెట్టుకునే వారంటే వల్లమాలిన ప్రేమ
- మిగతా ఏ విలేకరి.. ఎప్పుడు ఫోన్ చేసినా? ఎవరు మీరు? ఏం కావాలంటారు!
- విషయం దాటవేత.. అసంపూర్తి సమాచారమిచ్చి ఫోన్ కట్ చేస్తారు!
- వివరాలు అడుగుతున్న విలేకరులను 'పోలీస్-ప్రెస్' గ్రూప్ నుంచి తొలగింపు
- నిజానికి 'ఆయన అసమర్థత'పై జనాలకు అనుమానం
- వరుస చోరీలు.. హత్యలు.. కత్తిపోట్లు.. ఇసుక అక్రమ రవాణా.. పేకాట.. సెటిల్ మెంట్లపై గాడితప్పిన 'అడ్మినిస్ట్రేషన్'
- ఎక్కడా కనిపించని 'ఎస్సై శ్రీకాంత్' మార్కు




ఎస్సై శ్రీకాంత్.. కోరుట్లలో ఎవరికీ పెద్దగా తెలీని పేరు.! ఎందుకంటే.. ఆయనకంటూ 'ఏ- ప్రత్యేకమైన మార్కు' కనిపించదు కాబట్టి.! ఆయన కోరుట్లలో ఛార్జి తీసుకుని దాదాపు 11 నెలలు కావొస్తున్నా.. జనాలకు గుర్తుండిపోయేంత 'అడ్వెంచర్లేమీ' లేవు.! 'ట్రాఫిక్' అస్తవ్యస్తం.. 'నేరాలు'.. ఘోరాలే.! యథేచ్ఛగా ఇసుక వందలకొద్దీ ట్రాక్టర్లు.. టిప్పర్ల నిండా తరలిపోతున్నా.. ఎన్నడూ అడ్డుకున్నదీ లేదు.. ఒక్కట్రాక్టర్ నూ పట్టుకున్నదీ లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అట్లనే.. పలువురు 'కత్తిపోట్లకు' గురైనా సరైన 'విచారణ'కు దిక్కులేదు.! విచ్చలవిడిగా 'గంజాయి' సేవించే యువకుల సంఖ్య పెరుగుతున్నా 'పట్టించుకున్న దాఖలాలేవీ' కనిపించడం లేదు.. అడ్డుకట్ట వేసిందీ లేదంటే అతిశయోక్తి కాదు. ఇదే క్రమంలో 'తాగిన మైకం'లో కొందరు యువకులు నేరుగా 'అర్ధరాత్రి దాటాక' ఎస్సై శ్రీకాంత్‌పై దాడి చేసినా.. చర్యలు తీసుకోకపోవడంపై ఎన్నో అనుమానాలున్నాయి. ఆ వీడియో ఒకటి 'నెట్టింట' తెగ వైరలైంది. ఆ రోజే అతని 'కెపాసిటీ' ఏపాటిదో జనాలు 'ఫిక్స్' ఐపోయారు. అది జరిగిన మర్నాడే.. 'మంచోడు' అనే ఓ 'పాత నేరస్తుడు' దారుణ హత్యకు గురవడం జనాలను భయపెట్టింది. అసలు కోరుట్లలో ఏం జరుగుతోంది.! శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ఏం చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. మరోవైపు 'బ్యాంకు' ముందే 'చోరీలకు' పాల్పడుతూ.. స్వేచ్ఛగా బైక్‌లో వెళ్లిపోయిన 'దొంగలు' సీసీ కెమెరాల్లో చిక్కినా ఇంతవరకు వారిని పట్టుకోకపోవడంపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంది చౌరస్తా వద్ద ఒకడు..తాను ఎమ్మార్వో నంటూ ఓ వృద్ధురాలిని మోసగించి నగలు గుంజుకుని పారిపోతూ సీసీటీవీకి చిక్కారు. ఆ దొంగ జాడలేదింతవరకు. అలా కోరుట్ల లో ఒక 4-5 సంఘటనలు చోటుచేసుకున్నా ఆ దొంగలను పట్టుకునే చర్యలు ఎక్కడా కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ఏకంగా 'జాతీయ రహదారి పక్కన'గల మూడు దుకాణాల్లో షెట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడ్డా.. వారినీ ఇంకా పట్టుకోలేదు. ఇక ఆత్మహత్యలు.. ఎందుకు జరుగుతున్నాయి.? వాటి వెనుక నిజానిజాల సంగతేంటన్న విచారణకు దిక్కులేదన్నది కాదనలేని వాస్తవం.! ఎవరైనా ఆత్మహత్య చేసుకుని 'సూసైడ్ నోట్' రాసిపెట్టినా.? వాటి వివరాలు ఇవ్వడం ఈ 'అమీన్ సాబ్'కు అస్సలు ఇష్టం ఉండదు.

- నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య)




### ఏదైనా ప్రమాదం జరిగితే.!



సమాచార సేకరణ కోసం ఒక్క విలేకరులు ఆరా తీసిన వారికే కాదు.. ఎక్కడైనా.. ఏదైనా 'క్రైమ్' జరిగినపుడు.. ప్రమాదం జరిగిందని సమాచారం అందించాలనుకున్న వారు పదుల సంఖ్యలో ఫోన్ చేసినా 'రెస్పాన్స్' ఇవ్వకపోవడమన్నది జనాలకు చిర్రెత్తుకొస్తోంది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రతీ నెలా పెట్టే 'క్రైం మీటింగ్'లలో 'బాధితులు ఎవ్వరైనా? ఏ టైంలో ఠాణా మెట్లెక్కినా? అత్యంత ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించాలని నెత్తీనోరూ మొత్తుకుంటున్నా..' ఆ ముచ్చట్లేవీ బహుశా.. ఈయన చెవిలో పడవేమోన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతెందుకు.. మొన్న జరిగిన 'వినాయక విగ్రహాల తయారీ కేంద్రం' వద్ద జరిగిన 'విద్యుత్ ప్రమాద ఘటనే' సాక్షాత్కారం.! సార్..ఇక్కడ ప్రమాదం జరిగింది.. తొందరగా రండి.! ఎస్సై చెబితేనే.. గాయపడ్డవారిని 108 లో ఎక్కించుకెళతామని చెబుతున్న విషయం ఎస్సైకి చెబుదామంటే ఎంతమంది ఎన్ని సార్లు ఫోన్ చేసినా 'రెస్పాన్స్' ఇవ్వకపోవడంపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సీఐ సురేష్ బాబుకు ఇదే విషయాన్ని చెబితే ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇలా ఎందుకు అంటే.. సార్ లీవులో ఉన్నాడని సిబ్బంది చెప్పిన కొద్ది సమయానికే ఎస్పీ అశోక్ కుమార్ వచ్చినపుడు ఆయన వద్ద కనిపించడం గమనార్హం. లీవులో వెళ్లిపోయిన ఎస్సై అంత తొందరగా ఎలా వచ్చారని ఫోన్లు చేసిన వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇలా ఇలాంటి ఘటనలు ఎన్నో సార్లు జరిగినట్టు బాధితులు 'పాత్రికేయుల' దృష్టికి తీసుకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి.

### వివరాలు అడిగినవారు రిమూవ్!

ఏదైనా 'క్రైమ్' జరిగినపుడు 'వివరాల కోసం' ఫోన్ చేసిన విలేకరికి తీవ్ర నిరాశే మిగులుతుంది. తొలుత ఎవరు మీరు? ఏం కావాలి? అహా.! అలాగా.! ఔనౌను.. నాకిప్పుడే తెలిసింది.! తర్వాత చూద్దాం.. అంటూ ఏం చెప్పకుండానే .. సడెన్ గా ఫోన్ కట్ చేయడం ఆయనకు 'ఫోన్ తో పెట్టిన విద్య'.! సమాచారం అడిగిన వారు కొద్దీ సేపటి తర్వాత ఆ గ్రూపులో ఉండరు.




### 'పోలీస్ అండ్ మీడియా కోరుట్ల' గ్రూప్ నుంచి 'నేటి సాక్షి' రిమూవ్

2024 జూలైలో కోరుట్ల సీఐ సురేష్ బాబు 'నేటి సాక్షి' రిపోర్టర్ నెంబర్‌ను సమాచార నిమిత్తం 'పోలీస్ అండ్ మీడియా కోరుట్ల' పేరిట ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్ లో చేర్చారు. అయితే, అందులో పెట్టే అడపాదడపా సమాచారాన్ని 'వార్తలుగా' పెట్టడం జరిగింది. కానీ, ఈ మధ్య ఎందుకో గ్రూప్ లో పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం ఏదీ రావట్లేదని 'చెక్ చేసుకుని చూస్తే' అందులో 'నేటి సాక్షి' నెంబర్ రిమూవ్ చేయబడి ఉంది. అంటే.. ఒక్క 'నేటి సాక్షి'నే చేశారాన్న అనుమానంతో కొంతమంది ఇతర పాత్రికేయులనడితే ఒకరిద్దరు మావి కూడా తొలగించారని సమాధానం వచ్చింది. అంటే..ఈ నెంబర్ల తొలగింపు అనేది ఎవరైన 'అదృశ్య శక్తులు' తొలగించమంటే తొలగించారా.? లేక 'శ్రీకాంత్ సారే' ఉద్దేశపూర్వకంగా తొలగించారాన్నది ప్రశ్నప్రశ్నగానే ఉండిపోయింది. అంటే.. ఇక్కడ ఖుల్లంఖుల్లా విషయమేంటంటే.. ఎస్సై శ్రీకాంత్‌కు 'ఫస్ట్ ఆఫ్ ఆల్' ప్రశ్నించడం నచ్చదు.! వివరాలు ఆరా తీయడం అస్సలు నచ్చదు.! ఈ విషయం ఇదివరకోసారి ఇదే వాట్సాప్ గ్రూప్ లో చెప్పాడు కూడా.."నేరస్తుల వివరాలు.. ఫోటోలు దయచేసి అడుగరాదు.." అని కుండబద్దలు కొట్టేసినట్టు చెప్పేశారు. సార్ చెప్పిందే రాసుకోవాలన్నట్టు.! లేదంటే.. ఇదిగో ఇలా 'రిమూవ్' చేసేస్తారన్నట్టు.!

### అదే.. వారికిష్టమైన వారైతే!?

అతన్ని ప్రశ్నించకుండా.. ఆయనకు ఇష్టమైన వారు.. పైరవీకారులు..సెటిల్ మెంట్ చేసేవారు.. (అవి 'సివిల్-క్రిమినల్' ఏవైనా కావచ్చు..).. అధికారిక - అనధికారిక 'బ్రోకర్లు' గంటలు గంటలు ఎస్సై ఛాంబర్ లో తిష్ట వేసుకుని కూర్చుని ముచ్చటించవచ్చు.! వారు లోపల కూర్చున్న సమయంలో ..సార్ ని దర్శించుకునేందుకు నిజమైన బాధితులు.. ఫిర్యాదుదారులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తుంటారన్నది 'ఠాణా ఆవరణెరిగిన సత్యం'.!



### ఇవండీ..!

ఎలాంటి 'బ్రాండ్-ఇమేజ్' లేని ఓ సాధారణ 'అమీన్ సాబ్'కు సంబంధించిన దైనందిన జీవితంలోని 'రోల్ కాల్-హిస్టరీ'లో కొన్ని 'అముద్రిత పేజీలు'.. అడ్డాల వద్ద జనాలు రెగ్యులర్‌గా బాహాటంగానే చెవులు కొరుక్కునే ముచ్చట్లు. ఇంకా వెలుగుచూడని వెన్నో!

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
18 జూన్ 2025
హైదరాబాద్


# గిల్ చరిత్ర సృష్టించే అవకాశం!?

## 18ఏళ్ల తర్వాత ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచే చాన్స్



విరాట్ కోహ్లీ, ధోనీ టెస్టులలో భారతదేశం అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా పరిగణిస్తారు. కానీ వారు తమ సుదీర్ఘ కెరీర్‌లో ఒక్కసారి కూడా ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలవలేదు. టీమ్ ఇండియా చివరిసారిగా 18 సంవత్సరాల క్రితం ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. ఇప్పుడు 18 సంవత్సరాల తర్వాత, టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. గిల్ కెప్టెన్సీలో భారత్ ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. ఇది జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్ సిరీస్‌లో గిల్ తొలిసారిగా కెప్టెన్‌గా ఆడనున్నాడు. అతనికి ఇది అంత సులభం కాదు. కానీ గిల్ జట్టులో కెఎల్ రాహుల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నారు, మ్యాచ్ స్వరూపాన్ని మార్చే సత్తా కలిగి ఉన్న ఆటగాళ్లు వీళ్లంతా. అటువంటి పరిస్థితిలో, టీమ్ ఇండియా ఇంగ్లండ్‌కు గట్టి పోటీనిస్తుంది. ఈ జట్టు ఇంగ్లండ్‌ను ఓడించి సిరీస్‌ను కూడా గెలుచుకోవచ్చు. ఒకవేళ ఈ జట్టు అలా చేయగలిగితే, 18 సంవత్సరాల తర్వాత భారత జట్టు ఇంగ్లండ్‌లో సిరీస్‌ను గెలుచుకుంటుంది. భారత జట్టు చివరిసారిగా 2007లో ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకుంది. అప్పుడు రాహుల్ ద్రవిడ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. భారతదేశం, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో మొదటి మ్యాచ్ జూన్ 20 నుంచి హెడింగ్లీలో జరగనుంది. అదే సమయంలో, రెండో టెస్ట్ జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లో ప్రారంభమవుతుంది. మూడో మ్యాచ్ జులై 10 నుంచి లార్డ్స్‌లో జరగనుంది. సిరీస్‌లో నాల్గో మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనుంది. అదే సమయంలో, సిరీస్‌లో చివరి మ్యాచ్ జులై 31 నుంచి లండన్‌లోని ఓవల్‌లో జరుగుతుంది. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్. ఇప్పుడు భారత క్రికెట్ కీలక దశలో ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ వంటి ముగ్గురు గొప్ప ఆటగాళ్ళు టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. రవీంద్ర జడేజా కూడా T20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత టెస్ట్ జట్టు కొత్త శకం ఆరంభం కానుంది. ఈ మార్పు దశలో జట్టు నిర్వహణ, సెలక్షన్ కమిటీ చాలా పెద్ద పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయించింది. క్రిక్‌బ్లాగర్ ప్రకారం, అజిత్ అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా కొనసాగవచ్చని BCCI వర్గాలు తెలిపాయి. అతని పదవీకాలం పొడిగించవచ్చని సమాచారం. కానీ దానిని నిర్ధారించడానికి బోర్డు పూర్తి ప్రక్రియను అనుసరిస్తుంది. అజిత్ అగార్కర్ జూలై 2023లో చీఫ్ సెలెక్టర్‌గా సెలెక్ట్ అయ్యాడు. ఆయన ఆధ్వర్యంలో భారత జట్టు 2024 T20 ప్రపంచ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంది. ఈ సమయంలో భారత జట్టు 2023 ODI ప్రపంచ కప్ ఫైనల్ ఆడింది. సోర్స్ ప్రకారం అనేక అంశాలపై భారత జట్టు నిర్వహణపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల టెస్ట్ రిటైర్మెంట్‌లో ఆయన పాత్ర ఉందని కూడా చెబుతారు. ఇప్పుడు ఇంగ్లండ్ టెస్టు సిరీస్ కూడా వీళ్లందరికి కీలక మలుపుగా చెబుతారు. అందుకే కచ్చితంగా గెలవాలని కసితో బరిలోకి దిగుతున్నారు.



# ఇంగ్లండ్‌తో పోరుకు సిద్ధమైన యువ ఆటగాళ్ళు

భారత క్రికెట్ జట్టు దాదాపు ప్రతి ఫార్మాట్ ఈ నెల నుండి ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. ఇందులో ఇండియా సీనియర్, ఇండియా అండర్-19, ఇండియా-A, మహిళల జట్టు, ఇండియా దివ్యాంగ్ జట్టు ఉన్నాయి. అయితే ఇండియా-A ప్రయాణం ఇప్పుడు ముగిసింది. జూన్ 20 నుండి ఇండియా సీనియర్ జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత జూన్ 24 నుండి జూలై 23 వరకు జరిగే అండర్-19 జట్టు మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈ పర్యటనకు స్పెషల్ అట్రాక్షన్ గా వైభవ్ సూర్యవంశీ, కెప్టెన్ ఆయుష్ మాత్రే. కాగా ఈ పర్యటన కోసం జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సోమవారం గాయపడిన ఇద్దరు ఆటగాళ్ల స్థానంలో కొత్త ఆటగాళ్లను జట్టులో చేర్చారు. ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున అద్భుతంగా రాణించిన ఆయుష్ మాత్రే భారత జట్టుకు నాయకత్వం వహిస్తాడు. గత ఐపీఎల్లో రాజస్థాన్ రాయల్స్ తరపున 35 బంతుల్లో సెంచరీతో సహా 252 పరుగులు చేసిన 14 ఏళ్ల పేలుడు బ్యాట్స్‌మన్ వైభవ్ సూర్యవంశీ కూడా ఈ జట్టులో ఉన్నాడు. గత సంవత్సరం UAEలో జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో సూర్యవంశీ, మాత్రే భారత రన్నరప్ జట్టులో కూడా ఉన్నారు. అదే సమయంలో, వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ అభిజ్ఞాన్ కుండును జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ ఇండియా-ఇంగ్లాండ్ అండర్-19 మ్యాచ్ లాఫ్‌బరో విశ్వవిద్యాలయం లో 50 ఓవర్ల ప్రాక్టీస్ మ్యాచ్ అవుతుంది. ఆ తర్వాత హోవ్, నార్తాంప్టన్ , వోర్సెస్టర్‌లలో ఐదు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్ ఉంటుంది. దీని తర్వాత, ఇంగ్లాండ్ అండర్-19తో రెండు మల్టీ-డే మ్యాచ్‌లు వరుసగా బెకెన్‌హామ్, చెల్మ్స్‌ఫోర్డ్‌లో జరుగుతాయి.

**భారత అండర్-19 జట్టు:**

ఆయుష్ మ్హాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు, హర్వాన్ష్ సింగ్, ఆర్ఎస్ అంబ్రిస్, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్, యుధాజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఇనాన్, అన్మోల్జిత్,

**వన్డే సిరీస్ కోసం ఇంగ్లాండ్ అండర్-19 జట్టు**

థామస్ రీవ్ (కెప్టెన్), రాల్ఫీ ఆల్బర్ట్, బెన్ డాకిన్స్, జాడెన్ డెన్లీ, రాకీ ఫ్లింటాఫ్, అలెక్స్ ఫ్రెంచ్, అలెక్స్ గ్రీన్, జాక్ హోమ్, జేమ్స్ ఇస్బెల్, బెన్ మేయెస్, జేమ్స్ మింటో, ఐజాక్ మొహమ్మద్, జోసెఫ్ మూర్స్, సెబ్ మోర్గాన్, అలెక్స్ వేడ్.

# అక్రమ బెట్టింగ్ యాప్‌లపై ఈడీ విచారణ

### యాప్‌లను ప్రోత్సహించారని క్రికెటర్ల పై దర్యాప్తు

భారతీయ మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా కష్టాల్లో పడినట్లు కనిపిస్తున్నారు. వారి పేర్లు చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడంలో వినిపిస్తున్నాయి. ఈ విషయంలో యువరాజ్, హర్భజన్, రైనా కాకుండా, బాలీవుడ్ నటులు సోనూ సూద్, ఊర్వశి రౌతేలా పేర్లు కూడా వచ్చాయి. ఈడీ ఈ విషయంలో అందరినీ ప్రశ్నిస్తోంది. ఈ విచారణ 1xBet వంటి నిషేధిత ప్లాట్‌ఫారమ్‌ల ప్రచారానికి సంబంధించినది. ఈ ప్లాట్‌ఫారమ్‌లు ప్రకటనలు, తప్పుడు మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నాయని ఈడీ భావిస్తోంది. 1xbet వంటి ప్లాట్‌ఫారమ్‌లు సెలబ్రిటీలతో కలిసి పెద్ద సంఖ్యలో ప్రజలను మోసం చేస్తున్నాయని ఈడీ చెబుతోంది. నివేదికల ప్రకారం, ఈ ప్లాట్‌ఫారమ్‌లు 1xbet వంటి పేర్లను ఉపయోగించి ప్రచారం చేస్తున్నాయని ఈడీ విచారణలో తేలింది. ఇటువంటి ప్లాట్‌ఫారమ్‌లు వెబ్ లింక్‌లు, QR కోడ్‌ల ద్వారా వినియోగదారులను అసలైన చట్టవిరుద్ధమైన బెట్టింగ్ సైట్‌లకు పంపే పని చేస్తాయి. ఈడీ ప్రకారం, ఇది భారతీయ చట్టాలను నేరుగా ఉల్లంఘించడమే. ఈ ప్లాట్‌ఫారమ్‌లు తమను నైపుణ్యం ఆధారిత గేమ్‌లుగా చెప్పుకుంటాయని ఈడీ తెలిపింది. కానీ, ఇవి రిగ్డ్ అల్గారిథమ్‌ను ఉపయోగిస్తాయి. దీని కారణంగా ఇవి జూదం పరిధిలోకి వస్తాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై విచారణ జరగడం ఇదే మొదటిసారి కాదు. 2023-24లో ప్రసిద్ధ మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కుంభకోణం, ఇందులో చాలా మంది రాజకీయ నాయకుల పేర్లు వచ్చాయి. మాజీ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ పేరు కూడా ఇందులో ఉంది, ఈ కుంభకోణంలో లబ్ధి పొందారని ఆరోపించారు. బఘేల్ ఆరోపణలను రాజకీయ ప్రేరేపితంగా పేర్కొన్నారు. మహాదేవ్ ప్రమోటర్లు. ప్రస్తుతం దుబాయ్ నుంచి బహిష్కరణను ఎదుర్కొంటున్నారు, వారు ఆపరేషన్‌ను కొనసాగించడానికి అనేక ఫెయిర్‌ప్లే యాప్‌లను తయారు చేశారు. ఈడీ ప్రకారం మహాదేవ్ కేసులో చట్టవిరుద్ధమైన లాభం ?6,000 కోట్లకుపైగా ఉంటుందని అంచనా.



# బుమ్రాకు తొలి టెస్టులో విశ్రాంతినివ్వండి

### ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ బ్రాడ్ హాగ్



ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు.. ఆ టీమ్ తో తొలి టెస్టు ఆడేందుకు ఇంకా నాలుగు రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికీ కూడా ప్లేయింగ్ లెవన్ పై ఎలాంటి అప్డేట్ లేదు. సాధారణంగా టాస్ వేసిన తర్వాత మాత్రమే ప్లేయింగ్ లెవన్ పై స్పష్టత వస్తుంది. ఈసారి కూడా అదే తరహాను టీమిండియా ఫాలో కావచ్చు. అయితే పర్యటన ప్రారంభానికి ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో చెప్పినట్లుగా స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా ఈ సిరీస్ లో కేవలం 3 మ్యాచ్ లు మాత్రమే ఆడే అవకాశముంది. అయితే తన ఏయే టెస్టుల్లో బరిలోకి దిగాలనే దానిపై టీమ్ మేనేజ్మెంట్ మల్లగుల్లాలు పడుతోంది. తాజాగా దినిపై ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ బ్రాడ్ హాగ్ వ్యాఖ్యానించాడు. ఫలానా టెస్టుల్లో ఆడించాలని టీమిండియాకు సూచించాడు.. బుమ్రాకు తొలి టెస్టులో విశ్రాంతినిచ్చి, తర్వాత జరిగే రెండు టెస్టుల్లో ఆడిస్తే బాగుంటుందని హాగ్ తెలిపాడు. ఇందుకు సంబంధించిన వ్యూహాన్ని కూడా వివరించాడు. తొలి టెస్టులో బుమ్రా లేకపోవడం వల్ల అతనికి తగినంత విశ్రాంతి లభిస్తుందని, తొలి టెస్టు ఫలితంతో రెండో టెస్టులో బరిలోకి ఎలా ఆడాలనేదనిపై ఒక స్పష్టత వస్తుందని పేర్కొన్నాడు. ఇక బుమ్రా వరుసగా రెండు టెస్టుల్లో బరిలోకి దిగితే ఇంగ్లాండ్ జట్టు ఒత్తిడిలో పడిపోతుందని, దాంతో టీమిండిమా పని కాస్త సులభం అవుతుందని వ్యాఖ్యానించాడు. ఆ తర్వాత మిగిలిన రెండు టెస్టుల్లో ఏ టెస్టుల్లో ఆడించాలనేది టీమిండియా మేనేజ్మెంట్ నిర్ణయం అప్పటి పరిస్థితులను బట్టి తీసుకోవాలని సూచించాడు. వెన్ను నొప్పి కారణంగా బుమ్రా కెరీర్ కు బ్రేక్ పడింది. చాలా కాలం పునరావసం తర్వాత తను అంతర్జాతీయ క్రికెట్లోకి బరిలోకి దిగాడు. గతేడాది ప్రారంభమైన బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో ఆడి సత్తా చాటాడు. 32 వికెట్లతో ఆసీస్ ను వణికించాడు. అయితే ఐదో టెస్టులో గాయపడి దాదాపు నాలుగు నెలలపాటు క్రికెట్ కు దూరమయ్యాడు. అందుచేత అతనిపై వర్క్ లోడ్ పడకుండా, తెలివిగా కొన్ని మ్యాచ్ లలో ఆడించాలని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ టూర్ లో మూడు మ్యాచ్ ల్లో మాత్రమే బుమ్రా ఆడనున్నాడు. ఇక ఈ టూర్ ద్వారా భారత 37వ టెస్టు కెప్టెన్ గా శుభమాన్ గిల్ నిలవనున్నాడు. రోహిత్ శర్మ నుంచి తను వారసత్వాన్ని స్వీకరించనున్నాడు. రోహిత్ తో పాటు విరాట్ కోహ్లీ కూడా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. దీంతో వీరిద్దరి స్థానాలను భర్తీ చేయాలని పలువురు క్రికెటర్లు తహతహ లాడుతున్నారు. ముఖ్యంగా కరుణ్ నాయర్ లాంటి వెటరన్ క్రికెటర్ చాలా కాలం తర్వాత వచ్చిన అవకాశాన్ని రెండు చేతులా యూజ్ చేసుకుని, జట్టులో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలని భావిస్తున్నాడు. అలాగే మరికొంత మంది తమ లక్కును పరీక్షించుకోనున్నారు.




# 5 బంతుల్లో 5 వికెట్లు..

### సత్తాచాటిన స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠి మరోసారి వార్తల్లోకెక్కాడు. అయితే ఈసారి తన అద్భుత ప్రదర్శనతో వార్తల్లో నిలిచాడు. అతడు 5 బంతుల్లోనే 5 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోను లఖ్?నవూ ఓనర్ సంజీవ్ గొయెంకా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఒక స్థానిక టీ20 లీగ్‌లో సోమవారం జరిగిన మ్యాచ్?లో స్పిన్నర్ దిగ్వేశ్ అదరగొట్టాడు. ఈ లెగ్‌స్పిన్నర్ వం-
ుసగా 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దిగ్వేశ్ స్పిన్ మాయకు నలుగురు బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అవ్వగా, ఒక ప్లేయర్ ఎల్?బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్?లో నాలుగు ఓవర్ల తన స్పెల్?లో దిగ్వేశ్ 28 పరుగులిచ్చి మొత్తం 7 వికెట్లు నేలకూల్చాడు. దీంతో దిగ్వేశ్ సూపర్ పర్ఫార్మెన్స్?ను మెచ్చుకుంటూ లఖ్‌నవూ యజమాని సంజీవ్ గోయెంకా అతడి బౌలింగ్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.'స్థానిక టీ20 లీగ్‌లో దిగ్వేశ్ 5 బంతుల్లో 5 వికెట్లు తీసిన వీడియో ఇది. అతడికి ఇలాంటి స్కిల్స్ ఉండడం వల్లే ఐపీఎల్- 18లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున సత్తా చాటి వెలుగులోకి వచ్చాడు' అని గొయెంక రాసుకొచ్చారు. 'దిగ్వేశ్ రాఠి 5 స్టార్స్' అని లఖ్?నవూ సూపర్ జెయింట్స్? సోషల్ మీడియా ఎక్స్?లో ట్వీట్ చేసింది. కాగా, ఇటీవల ముగిసిన ఐపీఎల్?లో దిగ్వేశ్ తన ప్రదర్శనతో కంటే వివాదాలతోనే ఎక్కువగా ఫేమస అయ్యాడు. వికెట్ పడగొట్టిన అనంతం అతడు చేసుకునే సిగ్నేచర్ సెలబ్రేషన్స్? కాంట్రవర్సీ అయ్యింది. దీంతో ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అతడికి మూడుసార్లు ఫైన్ కూడా విధించింది. ఓవరాల్?గా ఈ సీజన్?లో దిగ్వేశ్ 13 మ్యాచ్?ల్లో 14 వికెట్లు పడగొట్టాడు. 2024లో జరిగిన మెగావేలంలో లెగ్ స్పిన్నర్? దిగ్వేశ్?ను లఖ్?నవూ సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..





# కర్ణాటకలో థగ్ లైఫ్ విడుదలకు లైన్ క్లియర్

## అడ్డుకోవడం సరికాదంటూ సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్ 17:** 'థగ్ లైఫ్' చిత్ర బృందానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కమల్‌హాసన్ నటించిన ఈ సినిమా కర్ణాటకలోనూ విడుదల చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈ సినిమాను కర్ణాటకలో నిషేధించిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల వల్ల ఆ సినిమాను నిలిపివేయాలంటూ బెదిరించిన సంఘాలను సుప్రీం హెచ్చరించింది. అలాంటి బెదిరింపులు చట్టబద్ధం కాదన్న అత్యున్నత న్యాయస్థానం.. థియేటర్‌లలో ఏది ప్రదర్శించాలో నిర్ణయించే అధికారం ఆ సంఘాలకు లేదని స్పష్టంచేసింది. ఎవరైనా ఒక ప్రకటన చేసినప్పుడు దాన్ని మరో కామెంట్‌తో ప్రతిఘటించే స్వేచ్ఛ ఉంది కానీ.. థియేటర్‌లు తగలబెడతామని బెదిరించే అధికారం ఎవరికీ ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కర్ణాటక ప్రజలు కమల్‌హాసన్‌తో విభేదించే స్వేచ్ఛను కలిగిఉన్నారని.. అదే సమయంలో ప్రాథమిక హక్కులను కూడా కాపాడాలని కోర్టు పేర్కొంది. ఒక సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత దాన్ని విడుదల చేయాల్సిందేనని సుప్రీం ఆదేశించింది. దాన్ని చూడాలా, వద్దా అనే అధికారం పూర్తిగా ప్రజలకు ఉంటుందని.. బెదిరింపుల ఆధారంగా సినిమాను ఆపకూడదని స్పష్టంచేసింది. చిత్ర నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు నుంచి తనకు బదిలీ చేసుకున్న సుప్రీంకోర్టు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందనను తెలియ జేయాలని ఆదేశించింది. ఈ విషయంలో నటుడు క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.



# కుబేరతో అలరించనున్న ధనుష్.. రష్మిక

ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు నటుడు ధనుష్. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి హాలీవుడ్ హీరోల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'కుబేర' జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ధనుష్ మ్యాష్‌అప్ వీడియోను ప్రదర్శించారు. అది చూసిన అభిమానులు గూస్‌బంప్స్ వచ్చేలా ఉందంటూ అభిప్రాయపడుతున్నారు. తాను హాలీవుడ్ సినిమాలో నటిస్తానని చెబితే ప్రజలు నవ్వేవారని ధనుష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇకపోతే ఇదే సినిమాలో రష్మిక నటించారు. నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు రష్మిక. 'కుబేర'తో జూన్ 20 నుంచి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మ్యాష్‌అప్ వీడియో ప్రస్తుతం అందరినీ ఆకట్టు కుంటోంది. ఇందులో ఆమెపై ఇండస్ట్రీలో అగ్ర హీరోలు ప్రశంసలు కురిపించడం చూపించారు.. అలాగే తాను కెరీర్ ప్రారంభంలో ఓ ఆడిషన్ ఇస్తే రిజెక్ట్ చేశారంటూ రష్మిక ఓ ఇంటర్వ్యూలో పంచుకున్న వీడియోను ప్లే చేశారు.





# ఢీ సీక్వెల్‌కు మంచు విష్ణు రెఢీ

తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు మంచు విష్ణు. జూన్ 27న ఈ సినిమా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు తన హిట్ సినిమా 'ఢీ' సీక్వెల్ గురించి మాట్లాడారు. 'ఢీ' సినిమా సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. 'ఆ సినిమా దర్శకుడు, నేను కలిసి సీక్వెల్ కోసం ప్రయత్నిస్తున్నాం. నేను ఆ చిత్రాన్ని ఎంతో ప్రేమతో చేశాను. ఏదో ఒకరోజు దర్శకుడు దాని సీక్వెల్ స్క్రిప్ట్‌తో నన్ను కలవాలని కోరుకుంటున్నాను. అదంతా రచయిత చేతుల్లోనే ఉంటుంది. స్క్రిప్ట్ సిద్ధమైన మరుసటి రోజే దాని షూటింగ్‌ను ప్రారంభిస్తాను' అని మంచు విష్ణు తెలిపారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో విష్ణు, జెనీలియా జంటగా నటించిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'ఢీ'. శ్రీహరి, జయప్రకాశ్‌రెడ్డి, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషించారు. 2007లో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, మంచు విష్ణు కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్‌లో ఒకటిగా నిలిచింది. అలాగే తన మనసులో ఉన్న మరో కథను కూడా బయటపెట్టారు. ప్రస్తుతం తాను 'కన్నప్ప' ప్రచారంలో బిజీగా ఉన్నట్లు చెప్పిన విష్ణు.. వేరే సినిమాలు ప్లాన్ చేయడం లేదని వెల్లడించారు. అయితే, 1947 నేపథ్యంలో సాగే పీరియాడిక్ సినిమా చేయాలని తనకు ఎప్పటినుంచో ఆలోచన ఉందన్నారు. ఆ ఆలోచనను నిజం చేయడం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గతేడాది విడుదలై హిట్‌ను సొంతం చేసుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమా తెలుగు రీమేక్ చేయాలని అనుకున్నట్లు మంచు విష్ణు చెప్పారు. అయితే, అప్పటికే ఆ సినిమా రైట్స్ మరొకరు సొంతం చేసుకున్నారని అన్నారు.

## విజయ్‌సేతుపతి, పూరి సినిమా టీమ్‌లో

# సంయుక్త జాయిన్

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటి సంయుక్త జాయిన్ అయినట్లు తెలుపుతూ టీమ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం.. అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇందులో ఆమె పాత్ర కీలకంగా ఉండనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు భాగమైన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు మొన్నటివరకూ వార్తలు వచ్చాయి. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడిగా విజయాన్ని అందుకునేందుకు గత కొంతకాలంగా ఎదురుచూస్తున్నారు పూరి జగన్నాథ్. ఆయన గత చిత్రాలు 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా విజయ్ సేతుపతితో కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంయుక్త వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రానున్న 'అఖండ 2'లోనూ ఆమె భాగమయ్యారు. ఇటీవలే చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. ఇందులోనూ ఆమెది నటనకు ప్రాధాన్యమున్న పాత్రని తెలుస్తోంది.






Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# మరికల్‌లో బిజెపి రచ్చబండ కార్యక్రమం

### బిజెపి పేట జిల్లా నాయకులు కే. నర్సన్ గౌడ్

**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 17 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో కురువ వీధిలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రచ్చబండ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా నాయకులు కే నర్సం గౌడ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అందుకు కార్యకర్తలు ప్రజలు కలిసికట్టుగా విజయం సాధించాలన్నారు. పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. బిజెపి పార్టీసత్తను చాటాలన్నారు. రచ్చబండ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించే ప్రజలను చైతన్య పరచాలన్నారు. అనంతరం కాలనీవాసుల ఆధ్వర్యంలో శాల్వలతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ వల్ల రవికుమార్ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసన్న గౌడ్ జిల్లా అధికార ప్రతినిధి, వడ్డే శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి, శెట్టి మహేష్ ఓబిసి మోర్చా ఉపాధ్యక్షులు, మంగలి వేణుగోపాల్ మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు సురేందర్ గౌడ్, పోలమోని రమేష్, కురుమన్న, ఎస్ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవాలు

**నేటి సాక్షి, నారాయణపేట జూన్ 17 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని తిలేరు గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం నాడు కన్నుల పండువగా భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల ఆధ్వర్యంలో జల్ది బిందె కార్యక్రమాన్ని ఊరేగింపుగా నిర్వహించారు. అనంతరం నారాయణపేట జిల్లా పిసిసి అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ రేవతమ్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా మొక్కుకున్న భక్తులు గొర్రె పొట్టేలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతర మహోత్సవ కార్యక్రమానికి నారాయణపేట, హైదరాబాదు, మహబూబ్నగర్, మక్తల్, గద్వాల, వనపర్తి, వివిధ ప్రాంతాల నుండి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. జాతర సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. జాతర ఉత్సవాల సందర్భంగా మరికల్ ఎస్సై రాములు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. పేట జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి ప్రత్యేక పోలీస్ బలగాలతో భద్రత ఏర్పాటు చేశారు.



# ముందు వచ్చిన రైతులకు టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టండి

### మామిడిపండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల యజమానులకు జిల్లా కలెక్టర్ సూచన
### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) రేణిగుంట :** మామిడిపండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల వద్ద టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్ పరిశ్రమల యజమానులకు సూచించారు. మంగళ వారం రేణిగుంట మండలం, ఎస్ఎన్ పురం గ్రామంలోని శ్రీ వర్ష ఫుడ్ ప్రాడక్ట్ ఇండియా లిమిటెడ్ కు చెందిన మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోతాపురి మామిడకాయలను తీసుకువచ్చిన రైతులకు ముందుగా టోకెన్ జారీ చేసే పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించారు. ముందుగా ఒక ట్రాక్టర్ మామిడికాయలను ఎంత బరువు ఉంటుందో పరిశ్రమలోని వే బ్రిడ్జి వద్ద బరువును పరిశీలించారు. రైతులు తీసుకువచ్చే మామిడి కాయలను నమోదు చేసే ప్రక్రియను సంబంధిత ఉద్యానవన శాఖ అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ముందుగా మామిడికాయలతో నిండి ఉన్న ట్రాక్టర్ ను బరువు వేయడం జరుగుతుందని,ఆ కాయలు అన్లోడ్ చేసిన తర్వాత ఖాళీ ట్రాక్టర్ బరువును తూచి ఖాళీ బరువును తీసివేసి మిగిలిన బరువును నమోదు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పరిశ్రమలో మామిడి కాయలను నిల్వ ఉంచిన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ వర్ష ఫుడ్ ప్రోడక్ట్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ విశ్వనాథ నాయుడు తమ యూనిట్లో 250 నుండి 300 టన్నులవరకు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం ఉందని తెలిపారు. ప్రస్తుతం 15 రైపనింగ్ చాంబర్స్ లో పూర్తిస్థాయిలో మామిడికాయలు నిల్వలు ఉన్నాయన్నారు. అందుకనే తాము ఇంకా రైతుల వద్ద నుంచి మామిడి కాయలను అన్లోడ్ చేయలేదన్నారు. అనంతరం మామిడి పండ్లను శుద్ధి చేసే తీరును అక్కడి నుండి వాటిని గుజ్జుగా తయారు చేసే విధానాన్ని ఆ పరిశ్రమ డైరెక్టర్లు విశ్వాస్, వర్ష లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఆ యూనిట్ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మామిడికాయలను తీసుకువచ్చిన రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. తమ తోతాపురి మామిడికాయలను పూర్తి కాపు అయ్యేంతవరకు స్థానిక మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమలు కేంద్రాలు రైతుల నుండి మామిడికాయలను తీసుకుంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడిపళ్ళ గుజ్జు తయారి పరిశ్రమ యజమానులకు కేజీకి 8/- రూపాయలు చొప్పున రైతులకు అందించాలని సూచించిందని, అదే సమయంలో ప్రభుత్వం నుంచి రైతులకు ఒక కేజీకి నాలుగు రూపాయల చొప్పున సబ్సిడీని కూడా ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. జిల్లాలోని తోతాపురి మామిడికాయల రైతులను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి పరిశ్రమ వద్ద ఉద్యానవన శాఖ అధికారులను,రెవెన్యూ అధికారులను ఏర్పాటు చేశామని, వారు రైతులు మామిడి పండ్ల పరిశ్రమల గుజ్జు తయారీ కేంద్రాల వద్దకు తీసుకువచ్చే మామిడికాయల టన్నులను నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. ఆమేరకు ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతుల ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు రైతులు తీసుకొని వచ్చే మామిడికాయల వివరాలను కంప్యూటరీకరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముందుగా స్థానిక రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత పల్ప్ యూనిట్ల యజమానులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఎడి సురేంద్రబాబు,స్థానిక తహసిల్దార్ సురేష్ బాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫారెస్ట్ అధికారి పై జాతీయ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు

### బంజార గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్

**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** పెద్దగూడెం తండా , వనపర్తి మండలం , గిరిజన రైతులకు ఇబ్బందికి గురి చేస్తున్నందున వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు చేయడం గురించి మంగళవారం నాడు బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ కి కలిసి ఫిర్యాదు చేశారు. వారు ఈ సందర్భంగా శివ నాయక్ మాట్లాడుతూ జాతీయ ఎస్టీ కమిషన్ ఫిర్యాదుకు సానుకూలంగా స్పందించి త్వరలోనే వనపర్తి జిల్లా ఫారెస్ట్ అధికారిపై నోటీసులు పంపిస్తామని చెప్పడం జరిగిందఅని శివ నాయక్ చెప్పారు. పెద్దగూడెం తండా, వనపర్తి మండలం లో గిరిజన రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటారు , వనపర్తి లోని అటవీ భూమికి ఆనుకొని దగ్గరలో ఉన్న గిరిజన రైతుల వ్యవసాయ భూమి దగ్గరికి గిరిజన రైతులను వెళ్ళనీయకుండా ఆపుతూ రైతులపై దాడిలకు దిగుతు ఇబ్బందులు పెడుతు ఇస్టాను సారంగా వ్యవహరిస్తున్న తీరుపై గతంలో చాలా సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నందుకు గిరిజన రైతులకు ప్రభుత్వాలు పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇంకా 58 మందికి గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం దగ్గర పెండింగ్ లోనే ఉన్నది అట్టి పోడు భూముల్లో కూడా గిరిజన రైతులకు రానివ్వకుండా ఫారెస్ట్ ఆఫీసర్ పి. రాణి, రేంజ్ ఆఫీసర్ నిఖిల్ రెడ్డి కలిసి దాదాపు 80 సంవత్సరాల నుండి గిరిజన రైతుల ఆధీనంలో ఉన్న భూములపై గిరిజన రైతులను సాగు చేయకుండా ,వెళ్ళనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నార అని గిరిజన మహిళలు అక్కడికి వెళ్తే కూడా వారిని బూతులు తిడుతూ లంబాడి అని పచ్చి బూతులు తిడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇట్టి విషయంపై 10/03/2025 నాడు రూరల్ ఎస్సై మరియు డిఎస్పి మరియు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసిన ఇలాంటి న్యాయం జరగలేదు అని కావున గిరిజన రైతులపై బూతు మాటలు తిట్టిన ఫారెస్టర్ ఆఫీసర్ పి. రాణి పై మరియు రేంజ్ ఆఫీసర్ నిఖిల్ రెడ్డి పై చర్యలు తీసుకొని ఎస్సి ఎస్సి అట్రాసిటీ కింద కేసు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకొని గిరిజన రైతులకు న్యాయం చేయగలరని శివ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్ కు కోరడం జరిగింది.



# ఆలయం నిర్మాణానికి ఆర్థిక సహాయం



**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 17:** నారాయణపేట జిల్లాలోని మరికల్ గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలందరికీ సహకారంతో మరికల్ చెరువు కట్ట, కట్ట మైసమ్మ అమ్మవారి నూతన పున ప్రతిష్ట దేవాలయ నిర్మాణం కోసం మరికల్ చెందిన కూసురు రవి ఆధ్వరంలో రూ, 11000/- వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా సమస్త మానవాళి పైన చల్లగా ఉండాలని కోరుకుంటున్నాము.

# మరికల్ లో బడిబాట కార్యక్రమం




**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 17 :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సమ్మేళిత విద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మరికల్ భవిత విలీన విద్య వనరుల కేంద్రంలో దివ్యాంగుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిర్వహిస్తున్నటువంటి ఫిజియోథెరపీ క్యాంపు దివ్యాంగులకు స్కాలర్షిప్స్ , ఎస్కార్ట్, ట్రావెల్ అలవెన్సు గురించి వివరించడం జరిగింది కార్యక్రమంలో అలీమ్ కో క్యాంపు ద్వారా గుర్తించిన దివ్యాంగుల కు రోలటర్, ఇంటలెక్చువల్ డిసేబులిటీ కిడ్స్, దివ్యాంగులకు పంపిణీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మరికల్ మండల ఎంఈఓ మనోరంజని , బాయ్స్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీ మతి నాగరత్నమ్మ , స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ రెడ్డి , సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు అనిత , తోసిప్ , హరి ప్రసాద్, మండల ఎం. ఐ.ఎస్. సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, దివ్యాంగుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ జాగిలాల నూతన గదులను పరిశీలించిన పేట జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్



**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 17:** మంగళవారం పేట జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ నారాయణపేట జిల్లా కేంద్రం సుభాష్ రోడ్, పత్తి బజార్ లోని పాత పోలీస్ స్టేషన్ క్వార్టర్స్ స్థలంలో ఏర్పాటు చేస్తున్న పోలీస్ జాగిలాల నూతన గదులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ 04 పోలీస్ జాగిలాలు సపరేటు గా వాటి సౌకర్యార్థం అధునాతనంగా నూతన గదులను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ జాగిలాల ఆరోగ్యం, భద్రత, శుభ్రత ను దృష్టిలో ఉంచుకొని సపరేట్గా గదుల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని, వాటికి తగిన వెళ్తురు ఉండాలే చూడాలని, డాగ్స్ వాషింగ్ కి సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి సరైన డైట్ పాటిస్తూ, ప్రతిరోజు ఎక్సైజ్ చేయించాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఎస్పీ గారితో పాటు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, నరసింహ లకు, హెడ్ కానిస్టేబుల్ రాములు ఉన్నారు.

# కుప్పం ఘటనపై ఢిల్లీలో వైసీపీ ఎంపీలు ఫిర్యాదు



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల)** : కుప్పం నియోజకవర్గం లో జరిగిన ఈ ఆటవిక, అనాగరిక సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ ఎంపీలు మద్దిల గురుమూర్తి, గుమ్మా తనూజ రాణి జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవహక్కుల కమిషన్ కి ఫిర్యాదు చేశారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ అప్పు కట్టలేదని ఒక తల్లిని తన కన్న కొడుకు ఎదుటే చెట్టుకు కట్టేసిన సంఘటన తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. అది ముఖ్యమంత్రి స్వయాన స్వంత నియోజకవర్గం కుప్పంలోనే ఇలా జరగడం శోచనీయమన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎంపీ తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
బుధవారం
18 జూన్ 2025


# మామిడి రైతుల కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనబడలేదా?

- గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపైనే అగచాట్లు పడుతుంటే ప్రభుత్వ చర్యలు ఎక్కడ?
- రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మేలు చేయకపోతే ఉద్యమాలు చేపడతాం
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కృపా లక్ష్మి



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) గంగాధర నెల్లూరు:** మామిడి రైతుల ఆవేదన, బాధలు రోజురోజుకు తీవ్రతరమైపోతున్నాయి, మామిడి రైతుల కన్నీళ్లు కూటమి ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కృపా లక్ష్మీ మండిపడ్డారు. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో రైతులు రాష్ట్ర కష్టాలు పడుతున్నారని, సంవత్సరం కాలం పాటు కష్టం శ్రమించి అప్పుచేసి పెట్టుబడి పెట్టి మామిడి పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక కొనుగోలు చేసేవారు లేక అన్నదాత కన్నీరు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిట్ ప్లస్ ఫోర్ పేరుకే చెప్పిన ఎక్కడ అమలు కాలేదని మండిపడ్డారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ మండల కేంద్రంలో జైన్ గుజ్జు పరిశ్రమ వద్ద దాదాపు మూడు కిలోమీటర్ల మేర రైతులు మామిడికాయలతో ట్రాక్టర్లలో నాలుగు రోజులుగా వేచి చూస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రభుత్వాలు కనీస స్పందన లేదు. తిండి నీరు లేక రోడ్లపై ఇబ్బందులు పడుతున్న రైతు తీవ్రఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పూర్తి మామిడి పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# తిరుపతి ఎయిర్పోర్ట్ కు శ్రీ వెంకటేశ్వర ఎయిర్పోర్ట్ గా నామకరణం

- దళితవాడల్లో శ్రీ వాణి నిధులతో ఆలయాలు నిర్మాణం
- టిటిడి పాలకమండలి పలు కీలక నిర్ణయాలు



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్ లో పాలక మండలి సమావేశం జరిగింది. సమావేశం అనంతరం చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులు డాలర్స్ దివాకర్ రెడ్డి, జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, నరేష్ కుమార్, శాంతారాం, జానకిదేవి లతో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుపతి విమానాశ్రయానికి శ్రీ వెంకటేశ్వర ఎయిర్పోర్టుగా నామకరణం చేసాం ఈ తీర్మానాన్ని ఎయిర్పోర్ట్ అథారిటీఅఫ్ ఇండియా కి పంపిస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరులో శ్రీవారి ఆలయాన్ని నిర్మించడానికి అక్కడే ప్రభుత్వం ముందుకు వచ్చి స్థలాన్ని ఇవ్వడానికి సుముఖంగా ఉందని త్వరలోనే ఆలయాన్ని నిర్మిస్తామని తెలియజేశారు. అదేవిధంగా కేంద్రమంత్రి కుమార్ స్వామి సెంట్రల్ ఫండ్ ద్వారా టిటిడి కి 100 ఎలక్ట్రికల్ బస్సులు ఉచితంగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారని వాటిని తిరుపతికి తీసుకురావడానికి తీర్మానం చేశామన్నారు. సి ఎస్ ఐ ఆర్ ల్యాబ్ ను తిరుపతిలో ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ ముందుకు వచ్చిందని త్వరలోనే ల్యాబ్ ఏర్పాటుకు స్థలాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. 1952లో ఢిల్లీలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల భవనాల పునర్నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మం వ్యాప్తి కోసం టిటిడి ధర్మ ప్రచార పరిషత్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఇందుకోసం ఏడాదికి 120 కోట్లు ఖర్చు చేస్తున్నదని వివరించారు. శ్రీ వాణి ట్రస్ట్ నిధుల ద్వారా దళితివాడల్లో ఆలయాలు నిర్మించడానికి తీర్మానం చేశామన్నారు. ఇప్పటికే ఒక్క చిత్తూరు జిల్లాలోని వివిధ గ్రామాల్లో 141 ఆలయాల నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించామన్నారు. టిటిడి కళాశాలలో ఏళ్ల తరబడి లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతను ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారని అందుకోసం దేవాదాయ శాఖ మంత్రి, టిటిడి ఈఓ,టిటిడి చైర్మన్ లు కమిటీగా ఏర్పడి చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. మరి కొన్ని నిర్ణయాలకు కూడా ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించారు.

# శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా




ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండకు నిరసనగా శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా లో పాల్గొన్న టీపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య ముదిరాజ్

**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** దేశంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నా లో టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు మహాధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య ముదిరాజ్. మహాధర్నలో నందిమల్ల యాదయ్య మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ అణిచివేత, పీడనం ,దోపిడి ఉంటుందో అక్కడ ఉద్యమం ఉంటుంది కాబట్టి సమాజంలో ఎక్కడ అణిచివేత జరగకుండా ప్రభుత్వాలు సక్రమంగా నడపాలని అన్నారు.సమాజంలో శాంతిని కాపాడుతూ ప్రజలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది కాబట్టి నక్సలైట్స్ తో శాంతిచర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న అమానవీయ చర్యను ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ,వామపక్షాల నేతలు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, ద్వారపోగు విజయబాబు, నందిమల్ల రాము, నందిమల్ల సందీప్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు...

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- హసన్ పర్తి మండలం పెంబర్తిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం హనుమకొండ హసన్ పర్తి మండలం పెంబర్తి గ్రామంలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు స్లాబ్ నిర్మాణాలు, రూఫ్ లెవెల్, బేస్మెంట్ లెవెల్ వరకు చేరుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు జిల్లా కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణ పనులను ఏ విధంగా చేయిస్తున్నారని, మేస్త్రీలు ఇంటి నిర్మాణానికి ఎంత తీసుకుంటున్నారు, నిర్మాణ పనులను ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఫోటో క్యాప్చర్ చేస్తున్నారా అని లబ్ధిదారులు స్వరూప, రజిత, నిర్మల, అరుణ, సమ్మక్క, మంజుల, సులోచన, రాజేశ్వరిలను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు దశల వారీగా బిల్లులు అందుతాయని, లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గృహనిర్మాణ శాఖ పిడి రవీందర్, డీఈ సిద్దార్థ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ రహీం పాషా, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# 207 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశాం

కమిషనర్ ఎన్.మౌర్య



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 207 మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టిడిఆర్ కమిటీ సభ్యులు ఆన్లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామని అన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 207 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు 187 మందిని ఎంపిక చేశామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో డిసిపి మహాపాత్ర, ఏసిపి లు బాలాజి, మూర్తి, ప్లానింగ్ సెక్రటరీ లు పాల్గొన్నారు.

# వనపర్తి పట్టణ కన్యకా పరమేశ్వరి గుడి ఆర్యవైశ్య సంఘానికి ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడు బచ్చు రాము



**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ శక్తిపీఠమైన అల్లంపూర్లో వాసవినిత్య అన్నదాన సత్రంలో ఎలక్షన్స్ జరిగాయి కల్వ రమేష్ 40 ఓట్ల తోన విజయం సాధించినారు. వాసవి నిత్య అన్నదాన సత్రం కార్య సమావేశంలో వనపర్తి పట్టణ కన్యకా పరమేశ్వరి గుడి ఆర్యవైశ్య సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన బచ్చు రాము కి ఘనంగా శాలువాలతో సన్మానించడం జరిగింది. వనపర్తి లో ప్రముఖ వ్యాపారవేత్త మారం బాల్లీశ్వరయ్య కి మరియు వనపర్తి ఆర్యవైశ్య సంఘ మాజీ కన్వీనర్ పూరి బాలరాజు కి వాసవి అన్నదాన సత్రానికి ఉపాధ్యక్షులుగా నియమించడం జరిగింది.ఈ విధంగా వనపర్తి జిల్లాలో పెద్ద ఎత్తున వనపర్తి లో సేవ చేయడానికి ఆర్యవైశ్యులు ఎల్లప్పుడు ముందు ఉంటారన్నారు.రమేష్ అధ్యక్షులు సన్మానం చేయడం జరిగింది.మరి వనపర్తి ఆర్యవైశ్య గుడిని ముందుకు తీసుకెళ్లాలని అక్కడ ఆర్యవైశ్యులకు వాసవి ఫంక్షన్ హాల్ కట్టియాలని రమేష్, బచ్చు రాము కి వారి గద్వాల జోగులాంబజిల్లా నుండి తప్పకుండా సహకరిస్తామని చెప్పి తెలపడం జరిగింది. బచ్చు రాము మాట్లాడుతూ ఫంక్షన్ హాల్ ఆర్యవైశ్యులకే కాదు ఇతర కులాల కు కూడా అతి తక్కువ డబ్బులకు కిరాయి ఇవ్వబడునని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో లెగిసెట్టి సాయి ప్రసాద్, ఎల్ అశోక్, కేకే మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**నేటి సాక్షి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి :** ఎల్ బి నగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ (ఐఏఎస్) ను మర్యాద పూర్వకంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి చర్లపల్లి డివిజన్ లో పర్యటించినప్పుడు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అలాగే వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచుకొని వివిధ కాలనీ లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
11
బుధవారం
18 జూన్ 2025

## ఇదే కదా రైతు రాజ్యం...!!!

**ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి**




**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** కేవలం ఏడాదిన్నర వ్యవధిలో 18 నెలల్లో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి రికార్డు నెలకొల్పింది.దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్ద మొత్తం ఖర్చు చేసిన దాఖలాలు లేవు.రాష్ట్ర బడ్జెట్లో అత్యధిక వాటాను రైతుల సంక్షేమం, రైతు కుటుంబాల అభ్యున్నతికి ఖర్చు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుఉంది.పంట రుణమాఫీ 5. 20,616 కోట్లు, రైతు భరోసా 5. 12, 682 కోట్లు,రైతు భరోసా వానాకాలం 5. 8675కోట్లు,వ్యవసాయానికి ఉచిత విద్యుత్ 5. 16,691 కోట్లు,ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్ 5. 43, 835కోట్లు,రైతు బీమా 5. 1, 455కోట్లు,పంటల బీమా 5. 1, 300 కోట్లు,మొత్తం 1,05,254 కోట్లు ఇది రైతు ప్రభుత్వం..

## లక్ష్మీనారాయణ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లూకాస్



**నేటి సాక్షి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి :** ఉప్పల్ డివిజన్‌లోని లక్ష్మీనారాయణకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లూకాస్ మరోసారి ఎన్నికయ్యారు. దీంతో పాటు కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ఛైర్మన్‌గా మధుబాబు ఎన్నికయ్యారు. వీరిద్దరి ప్రమాణ స్వీకారానికి పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కార్యక్రమంలో అధ్యక్షుడు పసల లూకాస్ , గౌరవ అధ్యక్షులు వెంకట్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ నాగేశ్వరరావు , చైర్మన్ మధు బాబు , వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రవీందర్, ఉపాధ్యక్షుడు మదల్ వల్లి, సునీల్, అడ్వైజర్లు అశోక్ గౌడ్, నిరంజన్, శ్రీను, ఎస్.కె మదర్, సంజీవ యాదవ్, సంయుక్త కార్యదర్శి, భాస్కర్ దాస్, మురళి రెడ్డి, నరసింహ చారి, డీజే నాగేష్, చాంద్ భాష, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పూర్ణచంద్రారెడ్డి, బీ రఘు, బాలు, ఇస్మాయిల్, సతీష్, టెంపుల్ వైస్ చైర్మన్, నాగరాజు,పరమేష్, సుధాకర్, ట్రెజరర్ ఆర్టీసీ వేణు, లీగల్ అడ్వైజర్ సత్యనారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఇతరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్తో మూడు పాడి గేదెలు మృతి



**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ శివారులో మేత కోసం వెళ్లిన మూడు పాడిగేదెలు విద్యుత్ షాక్తో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దండవేని అంతయ్య, మారాసు గంగారాం, గడికొప్పుల మల్లేశంలకు చెందిన గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. అయితే తెగిపడిన విద్యుత్ తీగలతో విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదవశాత్తు వాటికి తగలడంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పాఠశాలకు కంప్యూటర్ అందజేత




**నేటిసాక్షి, రాయికల్ :** రాయికల్ మండలం అల్లీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కాసం శ్రీనివాస్ కంప్యూటర్ను మంగళవారం అందజేసారు. ఇదే పాఠశాలలో సాంఘీక శాస్త్రం టీచర్గా పని చేసిన కాసం మురళి జ్ఞాపకార్థం మురళి కుమారుడు కంప్యూటర్ను అందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గణేష్, చంద్రమోహన్, కమాలాకర్, హెచ్ఎం గుర్రం శ్రీనివాస్గౌడ్, మాజీ ఎంపిటిసి మోర విజయలక్ష్మి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి




**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** వరంగల్ అడిషనల్ డీసీపీ లా, ఆర్డర్ మరియు ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ మరియు సి పి ఓ జంక్షన్ లను సందర్శించటం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ హనుమకొండ ట్రాఫిక్ సి ఐ కి, ట్రాఫిక్ కు సంబందించిన పలు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా ఫ్రీ లెఫ్ట్ లో వెహికల్స్ సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని, ఫుట్పాత్ ల ఆక్రమణలు లేకుండా చూడాలని, అవసరమైన చోట నో పార్కింగ్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే మిషన్ భగీరథ పైప్స్ వాల్వ్ ల వద్ద వేసిన ఐరన్ జాలీలు రోడ్ కంటే ఎత్తుగా ఉన్నందున వాటిని రోడ్ ఎత్తుకు చేయవచ్చేమో చూడాలని అలాగే జంక్షన్స్ లో ట్రాఫిక్ సిబ్బంది అలెర్ట్ గా ఉండి ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

# ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరినీ తల్లిదండ్రులు దగ్గర లోని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ హనంకొండ జిల్లా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి అధ్యక్షతన 49వ డివిజన్ జులైవాడ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అమ్మ మాట -అంగన్వాడి బాట ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడి సెంటర్ కి పిల్లల్ని పంపించి నట్లయితే వారిలో శారీరక పెరుగుదలతో పాటు మానసిక, సామాజిక, మేధో అభివృద్ధి కూడా జరుగు తుందన్నారు. అంగన్వాడీ టీచర్స్ అందరూ చిత్తశుద్ధితో న్యూ కరికులమ్ ప్రకారం ఫాలో అవుతూ పిల్లలని అంగన్వాడీ కేంద్రం పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకే అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బెల్ మోగించి ప్రీ స్కూల్ కార్యక్రమాలని న్యూ టైం టేబుల్, సిలబస్ ద్వారా నిర్వహిస్తూ ప్రీస్కూల్ నమోదు, హాజరు ను పెంచి, పిల్లలని సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్వాడీ సెంటర్లోనే ఉంచవలసిందిగా కోరారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా అందించే ఒక పూట సంపూర్ణ భోజనాన్ని గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలోనే తినేలాగా సూచించారు. స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా అంగన్వాడీ కేంద్రాలను వినియోగించు కోవాలని, ఒక గర్భిణీ గా ఉన్నప్పటి నుంచి అంగన్వాడి సెంటర్స్ లో నమోదు చేసుకొని, అంగన్వాడి సర్వీసెస్ అన్ని అందుకుంటూ పుట్టిన బిడ్డకి ఐదు సంవత్సరాల వయసు వచ్చేవరకు కూడా అంగన్వాడి సెంటర్ లో అంగన్వాడీ టీచర్లచే సంరక్షించ బడుతుందని తెలియజేశారు. అదేవిధంగా వారి కూతురైన ఆధ్యా పటేల్ మూడు సంవత్సరాలు పాపని కూడా అంగన్వాడి కేంద్రంలో జాయిన్ చేయడం జరిగింది. 30 మంది మూడు సంవత్సరాల నిండిన పిల్లలకి జిల్లా కలెక్టర్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ హనుమకొండ సిడిపిఓ ఎం విశ్వజ, సూపర్వైజర్స్ వి రాజలక్ష్మి, ఎం జ్యోతి, పోషణ అభియాన్ కో..ఆర్డినేటర్ డి. ప్రీతి, డిహెచ్ఈడబ్ల్యూ కో..ఆర్డినేటర్ డి కళ్యాణి అండ్ స్టాఫ్, సఖి అడ్మిన్ హైమావతి అండ్ స్టాఫ్, అంగన్వాడీ టీచర్లు ఎం ప్రసన్న, రమాతార, అంగన్వాడి హెల్పర్లు, ఏఎన్ఎంలు,ఆశా వం-్కర్లు, అంగన్వాడి లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గల్ఫ్ ఏజంట్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

**జగిత్యాల ఎస్పీ ఆశోక్కుమార్**




**నేటిసాక్షి, రాయికల్:** విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, నిరుద్యోగ యువతి, య-ువకులు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల ఎస్పీ ఆశోక్కుమార్ సూచించారు. రాయికల్, పోలీస్స్టేషన్ ను మంగళవారం ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేసారు. స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డ్లు తనిఖీ చేసి కేసుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిరంతరం ఈప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలన్నారు. గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్లూ కోల్ట్ ,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్ కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, ప్రజలతో సత్సంబంధాలను మెరుగు పరచుకుంటూ ప్రజలకు, య-ువతకు ప్రత్యేకంగా, షీ టీమ్స్, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాల నివారణ పై చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు.విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని య-ువకులను మోసం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయ-ుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరు కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ సమన్వయంతో విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీసారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టి కి తీసుకొని రావాలన్నారు. వీరి వెంట ఎస్ఐ లు సుధీర్రావు, రాజు, ఎఎస్ఐ దేవేంధర్నాయక్ తదితరులు ఉన్నారు.

# అంగన్వాడిలో పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య ఉంటుంది

- **రాయికల్ లో ముగిసిన అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమం**
- **జిల్లా సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ నరేష్**




**నేటిసాక్షి, రాయికల్ :** ఐదేళ్ల లోపు చిన్నారులందరిని తమ పేరెంట్స్ అంగన్వాడీ స్కూల్లో చేర్పించాలని ఇక్కడ ఆట పాటలతో కూడిన విద్య అందుతుందని జగిత్యాల జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేష్ తెలిపారు. జగిత్యాల ప్రాజెక్టు పరిధిలోని రాయికల్ పట్టణంలో మంగళవారం అమ్మ మాట అంగన్వాడి బాట ముగింపు, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు పిల్లలను అంగన్వాడి సెంటర్ కి పంపాలని, అంగన్వాడిలో పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య ఉంటుందన్నారు. అంగన్వాడి సెంటర్ కి వచ్చే పిల్లలకు ప్రిస్కూల్ పుస్తకాలు, రెండు డ్రెస్సులు, అసెస్మెంట్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రొజెక్టర్ ద్వారా పిల్లల తల్లితండ్రులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ప్రాజెక్టు సి.డి.పి.ఓ మమత, రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్, రాయికల్ తహసీల్దార్ నాగార్జున, మెప్మా టి.యల్. యం శరణ్య, ఈఓ పవిత్ర, జిల్లా మిషన్ శక్తి కోర్డినేటర్ అశ్విని, హేమ, హెల్త్ సూపర్వైజర్ లు శ్రీనివాస్, ఉమ, రాయికల్ మండల ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి, అంగన్వాడి టీచర్ లు, ఆయాలు, ఎ.ఎన్.ఏం లు, ఆశలు, ఆర్.పి లు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
బుధవారం
18 జూన్ 2025


# డబల్ బెడ్ రూమలు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- **గన్నేరువరం మండలంలో డబల్ బెడ్ రూమలు నిర్మించినటువంటి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి**
- **మండలం సిపిఐ నాయకులు డిమాండ్**



**నేటి సాక్షి, గన్నేరవరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో నిర్మించినటువంటి డబల్ బెడ్ రూమ్ లను మంగళవారం రోజున సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకంతో నిర్మించినటువంటి రూములు మెట్లు కూలిపోవడం జరిగిందని సొమ్ము కోసం ఆశ పడ్డ కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వాడడం సరైన మెంతదులో సిమెంట్ కలపకపోవడం వలన ఎక్కడిక్కడ కూలిపోవడం తొ లక్షల్లో నష్టం వాటిల్లిందని ఇంతటి ప్రజాధనం వృధా చేసినటువంటి సంబంధిత కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఇల్లు ఇలానే నిర్మించుకున్నాడా పట్టుమని 6 ఏండ్లు కాలేదు అప్పుడే ఇలా జరిగితే ఎలా అని మండిపడ్డారు పేదల కోసం నిర్మాణం చేపట్టి వారికీ స్వంత ఇంటి కలలు నెరవేరుతాయానీ ఆశపడ్డారు వారి ఆశల పై నీళ్లు చల్లారు అని అన్నారు ఇప్పటికి అయినా సంబంధించిన కాంట్రాక్ట్ పైన చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇండ్లను ఇల్లు లేని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేసారు చేయా లేని పక్షంలో రాబోయే కాలంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు .మండలంలో మంజూరు అయినటువంటి ఇందిరమ్మ ఇళ్ళు ను త్వరలోనే వాటిని పరిశీలిస్తామన్నారు. అర్హులైన వారిని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు .ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చోక్కల్ల శ్రీశైలం జిల్లా నాయకులు కాంతాల అంజిరెడ్డి మండల సహాయ కార్యదర్శిలు కూన మల్లయ్య పిప్పల్ల కనకయ్య ఆంజనేయుల చారి, న్యాత కొమరయ్య ,నయీామ్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు

- **హసన్ పర్తి మండలం సూదన్ పల్లి లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు**



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భారతి చట్టాన్ని అమలు చేస్తుందని, భూ సమస్యలున్న వారు భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సూదన్ పల్లి లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న రైతులు, స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్య ఉందని, కాస్తులో ఉన్నారా, సాదా బైనామాకు దరఖాస్తు చేశారా, భూములు అమ్మిన వారికి పాసుబుక్కులు ఉన్నాయా లేదా, భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలతో క్రయ విక్రయాలు చేశారు, తదితర భూ సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యను గురించి దరఖాస్తు చేసుకున్నట్లయితే, తహసీల్దార్ సంబంధిత సమస్యపై విచారణ సాగిస్తారని రైతులు, స్థానికులకు సూచించారు. రైతులు తమ భూ సమస్యను పేర్కొంటూ రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానికులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని, ఇండ్ల కోసం దరఖాస్తులను అందజేయాలని సూచించారు. సుదన్ పల్లి గ్రామంలో మొత్తం 96 అప్లికేషన్ లు మరియు మల్లారెడ్డి పల్లి లో మొత్తం 332 అప్లికేషన్స్ రావడం జరిగిందని, ఇందులో అధికంగా సాధాబైనామా అప్లికేషన్స్ వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ రహీమ్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో, గృహ నిర్మాణ శాఖ అధికారులు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, హసన్ పర్తి మండల సీనియర్ అసిస్టెంట్ కుమార స్వామి, ఆర్ ఐ లు ఫాజిల్, రాజేంద్ర ప్రసాద్, జూ.. అసిస్టెంట్లు నరేష్, నర్సింహులు, శ్వేతా, సతీష్ లు మరియు వి ఆర్ఏ లు అనూష, సస్య, సమ్మయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీతోనే అభివృద్ధి సాధ్యం

### చందుర్తి బిజెపి మండల శాఖ అధ్యక్షుడు మొకేలే విజేందర్



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి (సతీష్) :** భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బిజెపి చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మొకేలే విజేందర్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చందుర్తిలో సంబరాలు జరిపారు, నరేంద్ర మోడీ సారధ్యంలో దేశంలో కోట్లాది ప్రజలకు ఉచిత రేషన్ బియ్యం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహాల నిర్మాణం ఇతరత్రాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు, నరేంద్ర మోడీ సారధ్యంలో భారతదేశం ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీకి అత్యధిక స్థానాలు వచ్చే విధంగా పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సీనియర్ హనుమయ్య చారి పత్తిపాక శ్రీనివాస్, లోకాజీ సతీష్ ,యువ మోర్చా మండల అధ్యక్షులు మొత్కపల్లి రాజశేఖర్, బద్దం తిరుమల్ రెడ్డి, గోస్కల కమలకర్, బోరుగాయ తిరుపతి, కొక్కుల నరేష్ అయోధ్య పర్సరాములు, లింగపల్లి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజుల దోపిడి..!

- **చర్యలు తీసుకుంటారా...?**
- **ఉద్యమం చేయమంటారా...?**
- **తిరుమలగిరి అశోక్**



**నేటిసాక్షి,మిర్యాలగూడ :** పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడి పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ కూడా విద్యాశాఖ యంత్రాంగానికి కనిపించడం లేదా అని

ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఎదుట బిసి సంఘం ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ, మిర్యాలగూడలో విద్య వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ కూడా, ప్రభుత్వ యంత్రాంగం వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. విద్యా వ్యాపారాన్ని అరికట్టవలసినటువంటి విద్యాశాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు తొత్తుగా మారి, పేద విద్యార్థులను ఆర్థిక శోభ గురి చేస్తున్నారని, జిల్లా యంత్రాంగం స్పందించి, మిర్యాలగూడలో విద్యా వ్యాపారాన్ని అరికట్టకపోతే మాత్రం ప్రభుత్వ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదవలేని దుస్థితి ఈ ప్రభుత్వ యంత్రాంగం తీసుకొచ్చిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుకునే పరిస్థితి మిర్యాలగూడలో లేకుండా పోయిందని, కేవలం విద్యా వ్యాపారం మాత్రమే కొనసాగుతుందని, పాఠశాలలో జరిగే వ్యాపారాన్ని తక్షణమే అరికట్ట పోతే మాత్రం పాఠశాలల ఎదుట ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అజయ్, గంగాధర్, ఇంద్ర, శంకర్, రమేష్, సైదులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక అక్షరాభ్యాసం



**నేటి సాక్షి, కొడిమ్యాల17.జూన్:** కొడిమ్యాల మండలంలోని పూడూరులో ఐ సి డి ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సుధారాణి. మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ పిల్లలకు అక్షరాభ్యాసంతో చదువు నేర్చుకోవడం ఆరంభం జరుగుతుందని, తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలను మరింత పటిష్టం చేసిందని, అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ పిల్లలకు ఆంగ్ల విద్యను అందించడంలో అంగన్వాడి టీచర్లు సంసిద్ధతతో ఉన్నారని, అంగన్వాడి కేంద్రాలు ఆలనా - పాలన కేంద్రాలుగా పేరుగాంచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ సురేఖ. వసంత, స్నేహలత. పుష్పలత. పిల్లల తల్లులు ,ప్రీ ప్రైమరీ పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై జి నరేందర్ రెడ్డి కి ఘన సన్మానం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి**




**నేటిసాక్షి, గన్నేరువరం( బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గన్నేరువరం మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై జి. నరేందర్ రెడ్డిని నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్. బుర్ర తిరుపతి గౌడ్, వేణు, నల్ల చంద్రరెడ్డి, విద్యాసాగర్, న్యాత నరేష్, బుర్ర రాములు గౌడ్, నక్క దామోదర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## 29 సార్లు రక్త దానం



**నేటి సాక్షి,చెన్నూరు టౌన్ :** అత్యవసర సమయంలో రక్త దానం చేయడంలో ముందుండే హెల్ప్ నీడ్ ఫౌండర్ రామ్ క్రాంతి కుమార్ మంగళవారం అమృత ఆసుపత్రిలో పేసెంట్ కి అవసరం ఉండటంతో రక్త దానం చేసి సర్జరీకి ఉపయోగపడ్డాడు హెల్ప్ నీడ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ రామ్ క్రాంతి కుమార్ తాను గత 9సంవత్సరాల నుండి ఇప్పటి వరకు 29 సార్లు రక్త దానం చేసి ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేశారు.రానున్న రోజుల్లో యువకులు తనతో పాటు ముందుకు వచ్చిన ఆదర్శంగా నిలవాలని కోరారు

## సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) తిరుపతి :** ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను తిరుపతి నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు లబ్దిదారులకు చెక్కులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు. 48వ డివిజన్ రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన ఎఆర్ అయ్యప్ప కు ఎనభై తొమ్మిది వేల ఆరువందల పది రూపాయల చెక్కును ఎమ్మెల్యే తన కార్యాలయంలో మంగళవారం ఉదయం అందించారు. అలాగే 2వ డివిజన్ లోని ఆటోనగర్ కు చెందిన సోమలరాజు. రూప కు డెబ్బయ్ తొమ్మిది వేల నూట పన్నెండు రూపాయల చెక్కును ఎమ్మెల్యే ఆమెకు అందించారు. కాగా ఆంధ్రాబ్యాంక్ కాలనీకి చెందిన డి.కృష్ణ కిషోర్ కు మూడు లక్షలా ఐదువేలా డెబ్బై రెండు రూపాయల చెక్క్ ను ఎమ్మెల్యే ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, గోల్డ్ బాబు, పురుషోత్తం, సురేష్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

- మాది పనిచేసే ప్రభుత్వం..
- సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువచేస్తున్నాం..
- తల్లికి వందనం పథకాన్ని
- చిత్తశుద్ధితో అమలు చేశాం..
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** సుపరిపాలన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని ఆయన తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ అసమర్థత వల్ల రాష్ట్రం ఆర్థిక పరిస్థితి దివాలా తీసినా.., సి.యం.చంద్రబాబు అపార అనుభవం.., పాలనా దక్షతతో తల్లికి వందనం పథకం అమలయ్యిందనీ. కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించు కుందని.., ఫలితంగా సర్వత్రా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. అందుకనే మాది పనిచేసే ప్రభుత్వమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ఉద్ఘాటించారు. తల్లికి వందనం పథకం విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.. మంగళవారం ఓ ప్రకటనలో స్పందించారు. వేసవి సెలవులు ముగిసిన తక్షణం.., రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ..,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు చెప్పి నట్టుగానే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలు విద్య నభ్యసిస్తున్నారో.. వారందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి.,జూన్ 12వ తేదీనే.. విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసి, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ప్రజలకు జవాబు దారిగా పనిచేస్తున్న మా ప్రభుత్వం పనితీరును , చూసి ఓర్వలేని వైకాపా నాయకులు పనికట్టుకొని పనిచేసే ప్రభుత్వం పై బురదజల్లడం సరికాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తుందన్నారు.



రాష్ట్ర అభివృద్ధి ,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వారు పని చేయడం శుభపరిణామమన్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తాము కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి నవ్యాంధ్ర నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తామన్నారు

# రైతులకు తెలంగాణ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం

## మండల వ్యవసాయ అధికారి జె.కిరణ్మయి

**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్:** గన్నేరువరం మండలంలో మొత్తం 7542 రైతులకు తెలంగాణ ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కింద ఎకరానికి 6000 చొప్పున 94431851/-( 9 కోట్ల 44 లక్షల 31 వెయ్యి 851 రూపాయలు ) రైతు భరోసా కింద కేటాయించడం జరిగింది. ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి 16-6-25 సాయంత్రం 6:00 కి రెండు ఎకరాల లోపు ఉన్న రైతులకి రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగింది. అలాగే ఈరోజు కూడా లబ్ధిదారులకు వారి ఖాతాలో డబ్బులు జమ కావడం జరిగింది. ఈరోజు వరకి 5112 రైతులకు 40510219( నాలుగు కోట్ల ఐదు లక్షల పదివేల 219 రూపాయలు ) రైతుల ఖాతాలో జమ కావడినవి.కొత్తగా పాస్ బుక్ వచ్చినవారు అనగా జూన్ 5/2025 లోపు పట్టా పాస్ బుక్ వచ్చినా రైతులు వెంటనే మీ ఏఈఓ లని కలిసి మీ పట్టా పాస్ బుక్ వివరాలు, బ్యాంకు,ఆధార్ వివరాలు ఇచ్చి ఆన్లైన్ ఎంట్రీ చేయించు కోవలసిందిగా సూచించడం అయినది. అదేవిధంగా గత సంవత్సరం బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పు పడి DBT ఫెయిల్ అయ్యి మీకు రైతు భరోసా డబ్బులు పడని వారు సంబంధిత ఏఈఓ ని కలిసి మరొకసారి మీ అకౌంట్ నెంబర్ కరెక్షన్ చేపించుకోగలరని. మండల వ్యవసాయ అధికారి జె.కిరణ్మయి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఉప్పల్ భారత్ పెట్రోల్ పంపులో ఘరానా మోసం


**నేటి సాక్షి మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి :** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వాహన యజమానులకు ఆందోళన కలిగిస్తుంది. మరోవైపు పెట్రోల్ పంపులు మోసాలకు పాల్పడుతుండడంతో వాహనదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.మీటర్ ను రీ సెట్ చేయకపోవడం, ఎలక్ట్రానిక్ చిప్ లు పెట్టి మోసం చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ లోని ఉప్పల్ లో ఘరానా మోసం వెలుగుచూసింది. భారత్ పెట్రోల్ పంపులో మోసం జరుగుతున్నట్లు వాహనదారులు తెలిపారు. మెహిఫిల్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న భారత్ పెట్రోల్ పంపులో జరుగుతున్న మోసాన్ని బయటపెట్టారు.బాటిల్ లో పెట్రోల్ కొట్టించగా పెట్రోల్ పంపు దందా బయటపడింది. యాజమాన్యం మిషన్ లో సెట్టింగ్ పెట్టి పెట్రోల్ తక్కువ పోస్తున్నట్లు వెల్లడైంది. ఇందేటి అని కస్టమర్లు ప్రశ్నించగా పొంతన లేని సమాధానంతో యాజమాన్యం బుకాయిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 100 రూపాయల పెట్రోల్ ను బాటిల్ లో కొట్టించగా తక్కువ వచ్చింది. ఇదేంటి అని అడగగా 100 రూపాయలకు అంతే వస్తుందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నట్లు వాహనదారులు ఆరోపించారు.



అధికారులు భారత్ పెట్రోల్ పంపుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు : బషీర్

**నేటి సాక్షి, ఎండపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండపల్లి తాజా మాజీ ఎంపీటీసీ మహ్మద్ బషీర్ అధికారులతో కలిసి అర్హులైన 28 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బషీర్ మాట్లాడుతూ... తెలంగాణ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని అందులో భాగంగానే నేడు పేదోడి సొంత ఇంటి కల నిజం చేయాలనే ఉద్దేశ్యంతో గ్రామాగ్రామనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం లబ్దిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు ధన్యవాదాలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, గ్రామపంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అభి, అందూర్తి గంగాధర్, సత్యనారాయణ రావు, తోడేటి బాలింగ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మంతెన నర్సయ్య, లక్ష్మణ్, దేవి రవీందర్, అనిల్, మహేష్, కనుకుట్ల రఘు తదితరులు పాల్గొన్నారు.




# రైతాంగాన్ని ముంచాలనుకున్న వారిని కఠినంగా శిక్షించాలి

## తిప్పారపు శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి

**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండలంలో ఇటీవల వెలుగు చూసిన నకిలీ పత్తి విత్తనాల వ్యవహారంపై సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బెజ్జంకి మండలంలో నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న ముఠాను పట్టుకున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు.నకిలీ విత్తనాలు చలామణి అవుతున్న విషయం అధికారులు ఇప్పటి వరకు కనిపెట్టకపోవడం విచారకరం. రైతులు ఇప్పటికే సాగు చేసి విత్తనాలు పెట్టుకోవడం జరిగింది,రైతాంగానికి మోసం చేసి నకిలీ విత్తనాలు అంటగట్టిన వారు ఉన్నారు, అయితే ముందస్తుగా అధికారులు ఈ విత్తనాలపై నిఘా పెట్టకపోవడం అత్యంత విచారకరమైన విషయంగా సిపిఎం పార్టీ భావిస్తుంది, విత్తనాలు విత్తే ఆఖరి సమయంలో 160 కిలోల విత్తనాలను అధికారులు గుర్తించి పట్టుకోవడం జరిగింది,ఇప్పటికే ఎన్ని క్వింటాళ్ల నకిలీ విత్తనాలు రైతాంగానికి ఈ ముఠా అంట కట్టిందో తెలియని పరిస్థితి ఉన్నది , ఇప్పటికైనా ఈ ముఠా ఎవరెవరికి నకిలీ విత్తనాలు అమ్మిందో దీని వెనక ఎవరు ఉన్నారో ఎలాంటి ఒత్తిడిలు లేకుండా పూర్తిస్థాయిలో విచారణ చేసి ఈ మూటపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ముఠా దగ్గర మోసపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నష్టపోయిన రైతాంగానికి మండల అధికారులు క్షమాపణలు చెప్పాలని నష్ట పరిహారం చెల్లించాలని సంబంధిత మంత్రి ఎమ్మెల్యే స్పందించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది. లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆఫీస్



ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు.

# విద్యార్థులకు పౌష్టిక ఆహారం



**నేటి సాక్షి: జిన్నారం :** అంగన్ వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నామని ఐ సీ డీ ఎస్ సూపర్వైజర్ ప్రతిభ తెలిపారు. జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో మంగళవారం అక్షరాబ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతిభ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ నాగలక్ష్మి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గురువయ్య పార్థివ దేహానికి నివాళు లర్పించిన సిపిఎం నాయకులు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం సిపిఐ పార్టీ సభ్యులు, కామ్రేడ్ పోలేపల్లి గురువయ్య అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మరణించారు. సమాచారం అందుకున్న సిపిఐ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం గురువయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గురువయ్య మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటి యుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. సయ్యద్, మండల కార్యదర్శి లు ధీరావత్ లింగ నాయక్, అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, ధానావత్ శాంతి, మండల సమితి సభ్యులు పోలేపల్లి ఉదయ్, జమ్ముల కోటయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిని ప్రశ్నించడమే నేరమా?

## బెదిరింపుల మధ్య యువకుడి ఆత్మహత్య ప్రయత్నం



**నేటి సాక్షి, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం బేగంపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా మహిళా సంఘాలలో అవినీతి జరిగిందని అధికారులు దర్యాప్తులు జరుపుతున్న విషయం విధితమే. తాజాగా మహిళా సంఘాల్లో అవినీతి జరిగిందని ప్రశ్నించిన నేరానికి ఒక యువకుడిని బేధింపులకు గురి చేస్తే హార్పిక్ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బేగంపేట గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితుడు చరవాణిలో మెసేజ్ పెట్టిన వివరాల ప్రకారం మెరుగు లావణ్య భర్త రజనీకాంత్,భవాని మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. భవాని మహిళా సంఘం లో 7,60,000 అవినీతి జరిగిందని ప్రశ్నించినందుకు ఆదివారం రాత్రి మా ఇంటి పైకి వచ్చి దాడి చేశారని బాధితుడు తెలిపాడు. మరసటి రోజు ఉదయమే సిద్దిపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో మహిళా సంఘానికి సంబంధించిన అవినీతిపై ఫిర్యాదు చేయాగ మంగళవారం ఉదయం మహిళా సంఘం సిఏ బుర్ర అంజలి భర్త బుర్ర భూమేష్ తనపై తప్పుడు పోలీసు కేసులు పెట్టారని మనస్థాపానికి గురై నా చావుకి కారణం బుర్ర అంజలి బుర్ర భూమేష్ వీళ్ళు చేసిన అవినీతి ప్రజల సొమ్ము బిట్ కాయిన్ లో పెట్టి మా అందరి ని మోసం చేసి మా పైనే కేసులు పెడుతు, దాడులు చేస్తు, బెదిరింపులకు గురి చేస్తున్నారని, అవినీతి ని ప్రశ్నించడం వల్ల నా పై కేసు పెట్టడం నాకు అవమాన కరంగా అనిపిస్తుంది. అందుకే నేను చనిపోతున్న నా చావుకి కారణం బుర్ర భూమేష్ బుర్ర అంజలి నేను చనిపోయాక అధికారులు, ఏపీఎం, డీపీఎం గార్లు లాస్ట్ టైం లాగా కాకుండా ఇప్పటి అయినా డబ్బులు తీసుకోకుండా అడిట్ సక్రమంగా జరిపించగలరు అని కోరుకుంటున్న అవినీతి కి పాల్పడ్డ వాళ్లకు సపోర్ట్ చేసే ముందు అధికారులు ఒక్కసారి ఆలోచించండని వాట్సాప్ గ్రూప్ లో మెసేజ్ పెట్టాడు. ఇట్టి విషయంపై అధికారులు స్పందించి మహిళా సంఘాలలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని అధికారులే లోపాయికారిగా వ్యవహరిస్తున్నారని, మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారులు ఏం చేస్తారో వేసి చూడాల్సిందే.

# అంగన్వాడి కేంద్రాలలో అక్షరాభ్యాస కార్యక్రమం



**నేటి సాక్షి కొడిమ్యాల జూన్17:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం రామకృష్ణాపురం గ్రామంలోని అంగన్వాడి సెంటర్లలో పూడూరు సెక్టార్ సూపర్వైజర్ సుధారాణి సూచనలమేరకు అంగన్వాడీ టీచర్లు ఎలగుర్తి వినోద దువ్వంతుల విజయ లు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు ఈకార్యక్రమంలో మంచి అలవాట్లు ప్రీస్కూల్ విద్య యొక్క ప్రాముఖ్యతను తల్లులకు పిల్లలకు ఆటపాటల ద్వారవివరించి ప్రీస్కూల్ పుస్తకాలఅసైన్మెంట్ ను ప్రదర్శించారు తదనంతరం ఇంటింటా అంగన్వాడి కౌన్సిలింగ్ పుస్తకాన్ని ఉపయోగించి విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియపరుస్తూ బాల్య సంరక్షణను గూర్చి వివరించారు తదనంతరం క్రమంతప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు ఆరోగ్యవంతమైన పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులను అభినందించి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులచే ప్రశంసా పత్రాలను త్వరలో అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు గ్రామస్తులు పిల్లలు పాల్గొన్నారు.